Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 157
పేజీలు - 8 వెల- రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

గురువారం 14, డిసెంబర్-2023

## పార్లమెంట్‌పై దాడికి 22 ఏళ్లు



3లో..

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## సోనియాను కలిసిన ఉత్తమ్ దంపతులు



**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. తన సతీమణి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లిన ఆయన.. సోనియా గాంధీని, రాహుల్‌ను కలిశారు. అనంతరం అక్కడి నుంచి పార్లమెంట్‌కు వెళ్లి ఎంపీ పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేశారు. ఈ విషయాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసుకున్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆయన తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆయన తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు.

# నేటినుంచే తెలంగాణ అసెంబ్లీ

- స్పీకర్ ఎన్నికతో తొలిరోజు సమావేశం
- 15న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
- నాటి బిఆర్ఎస్ ఆర్థిక అవకతవకలపై శ్వేతపత్రం విడుదలకు ఛాన్స్



**హైదరాబాద్,డిసెంబర్13 :** స్పీకర్ ఎన్నికతో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. తెలంగాణ ఏర్పడ్డ తరవాత తొలిసారిగా తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను అధికార పార్టీగా కూర్చోబెట్టిన ప్రజలు.. అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా కట్టబెట్టారు. ఇప్పుడు ఆ రెండు పార్టీల స్థానాలు మారినా ఇరుపార్టీల మధ్య వాదోపవాదాలు, విమర్శలు, ప్రతివిమర్శలు తప్పేలా లేవు. ఇప్పటికే బిఆర్ఎస్ నేతలు నిలదీస్తామన్న రీతిలో ప్రకటనలు ఇస్తున్నారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చారని హరీష్ రావు, తప్పుడు వాగ్దానాలతో గద్దెనెక్కారని కెటిఆర్ విమర్శలు గుప్పించారు. ఇకపోతే ఈ అసెంబ్లీ సమావేశాల్లో అధికార పార్టీ 64 మంది సభ్యులతో, ఒక్క సీపీఐ ఎమ్మెల్యే మద్ధతుతో, ప్రతిపక్ష పార్టీగా ఉన్న బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. మరో వైపు 39 ఎమ్మెల్యేలతో గులాబీ పార్టీ, 8 మంది ఎమ్మెల్యేలతో కమలం పార్టీ, 7 గురు ఎమ్మెల్యేలతో ఎం.ఐ.ఎం పార్టీ ఈ కొత్త అసెంబ్లీలో కొలువు తీరనున్నాయి. ఇవన్నీ కాంగ్రెస్ టార్గెట్‌గా పని చేయనున్నాయి. తెలంగాణ తెచ్చిన పార్టీగా టీఆర్ఎస్ గత రెండు ఎన్నికల్లో పోటీ చేసి అధికార పక్షంగా అసెంబ్లీలో వ్యవహరించింది. రెండో టర్మ్‌లో బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష పార్టీయే లేని పరిస్థితిని కల్పించుకున్నారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు. 2014లో కాంగ్రెస్, టీడీపీలో మెజార్టీ ఎమ్మెల్యేలు అప్పటి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో అధికార పార్టీ హోదాలో ఉన్న టీఆర్ఎస్ కు అసెంబ్లీలో ఎదురే లేని పరిస్థితి. అయితే శాసన మండలిలో మాత్రం విపక్షాల సభ్యులు ఎక్కువ ఉండటంతో ఆయా అంశాలపై ఎక్కువ సమయం చర్చ జరిగేది. కాని శాసనసభలో మాత్రం ఏకపక్ష చర్చ సాగేది. 2018లోను అదే పరిస్థితి. 2018లోను కాంగ్రెస్ ది అదే పరిస్థితి. రేవంత్ రెడ్డి, జానారెడ్డి, మిగతా 4లో..

## రైతులకు ఉపయుక్తంగా కార్యాచరణ చేపట్టాలి

- పంటల సాగుతో అత్యాధునిక పద్ధతులు అవలంబన
- 14 కార్పొరేషన్లపై మంత్రి తుమ్మల సమీక్ష



**హైదరాబాద్,డిసెంబర్13 :** ప్రపంచంవ్యాప్తంగా వస్తున్న మార్పులను అనుగుణంగా ప్రస్తుత పోటీని తట్టుకునేలా సాంకేతికతను అందిపుచ్చుకుని అన్నదాతలకు ఉపయోగపడేలా కార్పొరేషన్లు పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ అనుబంధ శాఖలపై తుమ్మల సమిక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యయసాయ రంగానికి చెందిన 14 కార్పొరేషన్ల ఉన్నతాధికారులతో చర్చించారు. టీఎస్ ఆయిల్ ఫెడ్, టీఎస్ ఆగ్రో, మార్క్ ఫెడ్, టీఎస్ డీసీ, టీఎస్ ఎస్ ఓసీఏ, ట్రైబ్స్, హాకా, తదితర కార్పొరేషన్ల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కార్పొరేషన్లు విజయవంతంగా రైతులకు సేవలు అందించేందుకు అవసరమైన పద్ధతులను అవలంబిం చాలన్నారు. పంటల సాగులో ఇతర దేశాలు అనుసరిస్తున్న అత్యాధునిక విధానాలను మనం అలవరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర దేశాల నుంచి అత్యాధునిక పద్ధతులను అందిపుచ్చుకుని రైతులకు లబ్ధిచేకూర్చేలా పనిచేయాలని సూచించారు. కార్పొరేషన్లు కేవలం వ్యాపార దృక్పథంతోనే పనిచేయవద్దని రైతులకు ఉపయోగపడేలా విధానాలు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పాత పద్ధతులకు స్వస్తిపలికి సరికొత్త విధానాలతో రైతులోకానికి ఉపయుక్తంగా ఉండేలా కార్యాచరణ చేపట్టేలా కార్పొరేషన్లు పనిచేయాలన్నారు.ప్రతీ కార్పొరేషన్ సరికొత్త సాంకేతికను అందిపుచ్చుకుని సమర్థంగా పనిచేసేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు.కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను అందిపుచ్చుకుని వాటిని సక్రమమైన పద్దతుల్లో అమలు పరిచేలా కార్పొరేషన్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ దిశగా ఇప్పటి వరకు కార్పొరేషన్లు చేసిన కృషి ఏంటో పూర్తి నివేదిక సమర్పించాలని ఆయా కార్పొరేషన్ల అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశించారు. రైతులకు నష్టం జరిగే ఎటువంటి విధానాలకైనా వెంటనే స్వస్తిపలకాలని సూచించారు. ప్రైవేటు కంపెనీలకు లబ్ధిచేకూర్చే యంత్రాలు, మిగతా 2లో..

# స్థానిక పోరుకు సై అంటే సై

- మొదటిసారిగా జిల్లాలో మూడవ పార్టీ ప్రవేశం
- పాత కాపులతో కొత్త మహిళా నాయకురాలి పోటీ

(సిరిసిల్ల రాజేంద్ర శర్మ)



**జగిత్యాల డిసెంబర్ 13 (ప్రజా మంటలు) :** అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంతలోనే శాతనిక సంస్థల ఎన్నికల పండుగ ప్రారంభమైంది. ఇక జరగాల్సిన ఎన్నికలు స్థానిక ఎన్నికలు గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తు లేనప్పటికీ, తమ తమ పార్టీ క్యాడర్ను బట్టి ఆయా స్థానాలలో పోటీ చేసే అభ్యర్థులకు మద్దతు తెలుపుతారు. దీంతో ఆయా పార్టీల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి లో ఉన్న నాయకులు తమ సత్తాను స్థానిక పోరులో చూపించడానికి మరో నెల రోజుల వ్యవది ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలు, శాసన సభ ఎన్నికల్లో ఓటమి చెందిన అభ్యర్థులను, వారిని అనుసరించిన అనుచర గణాలకు తమ శక్తిని చూపించుకొని చక్కన అవకాశం. తమ మనుగడకు పార్టీలో తమ అధినాయకుని వద్ద తమ పలుకుబడి పెంచుకొని రాజకీయాల్లో కొనసాగడానికి ద్వితీయ శ్రేణి నాయకులకు ఈ ఎన్నికలు ఉపకరిస్తాయి. ఇదిలా ఉండగా జగిత్యాల నియోజకవర్గం లో పలుమార్లు గెలుపు ఓటములు చవిచూసి, ఉత్తాన-పథనాలను పొందినప్పటికీ, వయోభారమైనప్పటికీ ప్రజాసేవే తన పరమావధి అని తన ప్రాణం ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తూ వారికి నిరంతరం అందుబాటులోనే ఉంటానంటూ రాజకీయాల్లో కొనసాగుతున్న తాటిపర్తి జీవన్ రెడ్డి మళ్ళీ తన పట్టు చూపాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు. గత శాసన సభ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ పట్టువదలని విక్రమార్కుడిలా తిరిగి పట్టభద్రుల ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించిన జీవన్ రెడ్డి 2023 శాసనసభ ఎన్నికల్లో తన పాత ప్రత్యర్థి బా రా స అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్ పై మళ్ళీ ఓటమి చెందాడు. అయితే రాష్ట్రంలో సీన్ రివరసయ్యి, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోనికి రావడం జీవన్ రెడ్డి ఓటమి చెందడం, ఆయనకే కాదు, ఆయన క్యాడర్కు ఒకింత నిరాశకు గురి చేసింది. అయితే తమ నాయకునికి సీనియర్ కోటాలో శాసనమండలి చైర్మన్ గా గాని లేదా మంత్రి పదవి గాని వరిస్తుందని గంపెడ ఆశతో ఆయన అనుచర గణం ఎదురుచూస్తున్నది. తారుమారైన అంచనాలు -ఎన్నికల్లో గెలిచినా-ప్రభుత్వం పోయింది.ఇదిలా ఉండగా బారాస అభ్యర్థిగా మళ్ళీ గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ సైతం జీవన్ రెడ్డి సెంటిమెంట్ లాగే జగిత్యాలలో ఆయన గెలిచినప్పటికీ, రాష్ట్రంలో బారాస అధికారం లేకపోవడం గులాబీ దళానికి ఒకింత నిరాశానే అని చెప్పక తప్పదు. గత ఎన్నికలతో పోలిస్తే మెజార్టీ తగ్గినప్పటికీ, గతంలో ఒక పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే, స్థానిక సంస్థలలో, మున్సిపల్ ఎన్నికల్లోనూ జగిత్యాల పురపాలన, మిగతా 2లో..

## స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ ఎన్నిక లాంఛనమే



3లో..

- ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవం
- నేడు అధికారికంగా ప్రకటన..




3లో..

## ధరణి అవకతవకలపై ప్రభుత్వం దృష్టి

- ఉన్నతస్థాయి సమీక్షించిన సిఎం రేవంత్

## అబద్దాల ప్రచారంతో కాంగ్రెస్ గద్దెనెక్కింది



3లో..

## ప్రజానాడి




## పార్లమెంటులో ఇద్దరు ఆగంతకుల కలకలం

- పబ్లిక్ గ్యాలరీనుంచి దూసుకు వచ్చిన దుండగులు
- టియర్ గ్యాస్ వదడంతో అప్రమత్తమైన సిబ్బంది
- పట్టుకుని భద్రతా సిబ్బందికి అప్పగింత
- ఘటనతో పరుగులు తీసిన ఎంపిలు..లోక్‌సభ వాయిదా
- ఘటనపై విచారణకు ఆదేశించిన స్పీకర్ ఓంబిర్లా



**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** పార్లమెంటులో భద్రతావైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడింది. బుధవారం లోక్ సభ జరుగుతున్న సమయంలో పబ్లిక్ గ్యాలరీనుంచి ఇద్దరు యువకులు అకస్మాత్తుగా సభలోకి దూకారు. నల్లచట్టాలను రద్దుచేయాలి అంటూ వారు నినాదాలు చేస్తుండగా, కొందరు ఎంపీలు వారిని పట్టుకుని భద్రతా సిబ్బందికి అప్పగించారు. దీంతో సభ వాయిదాపడింది. 2001లో పార్లమెంటుపై ఇదే రోజున దాడి జరిగింది. తిరిగి అదే రోజున ఈ సంఘటన చోటు చేసుకోవడం కలవరం రేకెత్తిస్తోంది.లోక్ సభలో టెన్షన్ వాతావరణం నెలకొంది. గ్యాలరీ నుంచి ఇద్దరు అగంతకులు లోక్‌సభలోకి దూకి టియర్ గ్యాస్‌ను వదిలారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. దీంతో వెంటనే ప్యానల్ స్పీకర్ సభను వాయిదా వేశారు. ఎంపీలు భయంతో బయటకు పరుగులు తీశారు. కొత్త పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం కనిపిస్తోంది. స్పీకర్ వైపు ఓ ఆగంతకుడు పరిగెత్తాడు. కాగా 2001లో ఇదే రోజు పార్లమెంట్‌పై ఉగ్రవాదుల దాడి చేశారు. 22 ఏళ్ల తర్వాత పార్లమెంట్‌పై మరోసారి దాడి జరిగింది. కొత్త పార్లమెంట్ లోక్‌సభలో బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. అయితే ఆ ఇద్దరిని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారని, వారిని విచారణ జరిపితే అన్ని విషయాలు బయటకు వస్తాయని ఎంపీలు తెలిపారు.ఈ సంఘటనపై పార్లమెంటు మిగతా 4లో..

## గిరిజన భూముల కబ్జా

### మాజీమంత్రి మల్లారెడ్డిపై కేసు నమోదు

**మేడ్చల్,డిసెంబర్13 :** గిరిజనుల భూములు కబ్జా చేశారని ఫిర్యాదు నేపథ్యంలో శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో మాజీ కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. 47 ఎకరాలు కబ్జా చేశారని ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రాత్రికి రాత్రి రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మార్వోతో పాటు మల్లారెడ్డిపై ఫిర్యాదు రావడంతో నాలుగు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. మల్లారెడ్డితో పాటు అతని అనుచరులు 9 మందిపై 420 చీటింగ్ కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ నమోదు అయ్యింది.శామీర్‌పేట్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిరి జిల్లా మూడు చింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలోని సర్వేనెంబర్ 33, 34, 35లో గల 47 ఎకరాల 18 గుటల ఎస్టీ (లంబాడీల) వారసత్వ భూమిని మాజీ మంత్రి మల్లారెడ్డి, అతని బినామీ అనుచరులు 9 మంది అక్రమంగా కబ్జా చేసి, కుట్రతో మోసగించి భూమిని కాజేశారని శామీర్‌పేట పోలీస్టేషన్‌లో ఫిర్యాదు నమోదు అయ్యింది.విచారణ చేపట్టిన పోలీసులు మాజీ మంత్రి, అతని అనుచరులు, మల్లారెడ్డి బంధువు శ్రీనివాస్ రెడ్డి, కేశవాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ భర్త గోనె హరి మోహన్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (డిసిఎంఎస్)జిల్లా సహకార సంఘం వైస్ చైర్మన్ శామీర్‌పేట్ మండల వ్యవసాయ సహకార సేవా సంఘం చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి శివుడు, స్నేహ రామిరెడ్డి, రామిడి లక్ష్మమ్మ, రామిడి నేహా రెడ్డిలపై శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ 420 చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్ నామినేషన్

## మద్దతు పలికిన విపక్ష బిఆర్ఎస్

## నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం, డిప్యూటి సిఎం

## కెటిఆర్ సహా పలువురు మంత్రుల రాక



**హైదరాబాద్,డిసెంబర్13 :** తెలంగాణ శాసనసభ స్పీకర్ పదవికి వికారాబాద్ ఎంఎల్ఎ గడ్డం ప్రసాద్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. శాసనసభ కార్యదర్శికి ఆయన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంట సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి మల్లు,పలవురు కాంగ్రెస్ మంత్రులు,ఎంఎల్ఎలు, బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, మాజీ మంత్రి కెటిఆర్ తదితరలున్నారు. ప్రసాద్ కుమార్ పేరును ప్రతిసాదిస్తూ కెటిఆర్ నామినేషన్ పత్రాలపై సంతకం చేశారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయానికి వెళ్లి మాజీ మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. అనంతరం స్పీకర్ నామినేషన్ కార్యక్రమానికి కేటీఆర్‌ను శ్రీధర్ బాబు ఆహ్వానించారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి వెళ్లి స్పీకర్ నామినేషన్ పత్రాలపై కేటీఆర్ సంతకం చేశారు. మరోవైపు శాసనసభకు కాంగ్రెస్ పార్టీ తరఫున స్పీకర్ అభ్యర్థిగా మాజీ మంత్రి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. స్పీకర్ పదవికి గడ్డం ప్రసాద్ నామినేషన్ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కొత్తగా కొలువుదీరనున్న శాసనసభకు కాంగ్రెస్ పార్టీ తరఫున స్పీకర్ అభ్యర్థిగా మాజీ మంత్రి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. సహజంగా అధికార పార్టీ స్పీకర్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికవుతుంటారు. గడ్డం ప్రసాద్ స్పీకర్‌గా నియమితులైతే తెలంగాణ రాష్ట్రానికి తొలి దళిత స్పీకర్ కానున్నారు. ప్రస్తుత శాసన సభలో అత్యధిక మంది సభ్యులు అగ్రకులాలకు చెందిన వారేనన్న సంగతి తెలిసిందే. సభలో వారికి మాట్లాడే అవకాశం ఇచ్చే, వారిని నియంత్రించే అధికారాలు కలిగిన స్పీకర్ పదవిని దళిత నేతకు ఇస్తున్నామన్న భావనను ప్రజల్లోకి పంపేందుకే కాంగ్రెస్ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుందని పార్టీ నేతలు చెబుతున్నారు.

# ఖమ్మంలో పోటీకి రేణుక రెడీ

## తనకు పోటీ ఎవవూ లేరన్న ధీమా



**ఖమ్మం,డిసెంబర్13 :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు..వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు ఇప్ప టి నుంచే అభ్యర్థులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఇప్పుడు ప్రధాన నేతలు పొంగులేటి, తుమ్మల అసెంబ్లీకి ఎన్నిక కావడం, మంత్రులుగా బాధ్యతలు చేపట్టడంతో ఖమ్మం పార్లమెంట్ స్థానంపై రేణుకా చౌదరికి పోటీ లేకుండా పోయింది. అలాగే సోనియా అండదండలతో ఆమెను కాదనే వారు ఉండకపోవచ్చు. దీంతో ఆమె ఇప్పటి నుంచే తన కార్యాచరణతో రంగంలోకి దిగారు. రోజురోజుకూ ఆశావహుల సంఖ్య ఎక్కువవుతున్నా ఖమ్మంలో మాత్రం ఆమెకు పోటీలో నిలిచేవారు లేరనే అంటున్నారు. ఈ టికెట్‌పై ఇప్పటికే కొంత మంది మాజీ ప్రజా ప్రతినిధులు గురిపెట్టగా.. ఇటీవల మారిన రాజకీయ పరిణామా లతో మరికొందరు లిస్ట్ లో చేరారు. ఎలక్షన్లకు ఇంకా ఉన్నప్పటికీ అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఖమ్మం పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాజాగా కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలుపొందారు.ఏడు సెగ్మెంట్లలో కలిపి బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్ల కంటే కాంగ్రెస్ కు రెండున్నర లక్షల ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి. దీంతో కాంగ్రెస్‌టికెట్ కోసం భారీ డిమాండ్ ఏర్పడింది. టికెట్ కోసం మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరి ప్రధాన పోటీదారుగా ఉన్నారు. ఆమె 1999, 2004 ఎన్నికల్లో ఖమ్మం నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు చేతిలో ఓడిపోగా, 2014 ఎన్నికల్లో పొత్తులో భాగంగా సీపీఐకి సీటు కేటాయించడంతో కాంగ్రెస్ పోటీలో లేదు. 2019లో కాంగ్రెస్ తరఫున రేణుకా చౌదరి పోటీ చేయగా ఓటమిపాలయ్యారు. ఈసారి కూడా తనకే టికెట్ ఇవ్వాలని ఆమె కోరుతున్నారు.

# సిఎం రేవంత్‌ను కలిసిన సిపి శ్రీనివాసరెడ్డి

## సిపిఆర్‌వో అయోధ్య రెడ్డిలు



**హైదరాబాద్,డిసెంబర్13 :** నగర పోలీస్ కమిషనర్‌గా నియమితులైన కొత్తకోట శ్రీనివాసరెడ్డి బుధవారం సిఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తనకు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞ తలు తెలిపారు. అలాగే సిపిఆర్‌వో గా నియమితులైన అయోధ్యరెడ్డి కూడా సిఎం రేవంత్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తనకు బాధ్యతలను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# మల్లు భట్టి విక్రమార్క అధికారిక నివాసంగా ప్రజాభవన్



**హైదరాబాద్,డిసెంబర్13 :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా పేరు మార్చిన ప్రభుత్వం ఇప్పుడు మరో సం చలన నిర్మయం తీసుకుంది. డిప్యూటీ సీఎంగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కకు ఆ భవనాన్ని అధికారిక నివాసంగా కేటా యిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంత కాలం ఈ భవనం కెసిఆర్ ఉండగా ఆయన అధికారిక నివాసంగా ఉంది.

# నిర్వాసితులకు అండగా ఉంటాం

## మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**సిద్దిపేట,డిసెంబర్13 :** తెలంగాణ రాష్ట్రంలో హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గౌరవెల్లి, దేవాదుల పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగుకు నీళ్లిస్తామన్నారు. జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట గౌరవెల్లి ప్రాజెక్ట్ అని విమర్శించారు. ఇంతవరకు డిస్ట్రిబ్యూషన్ కాలువల నిర్మాణమే లేదని.. టాంక్ నింపి నీళ్ళు ఇవకుంటే ఏం చేసుకుంటామని ప్రశ్నించారు. తోటపల్లి భూ నిర్వాసితుల సమస్య ప్రస్తుతం కోర్టులో ఉందన్నారు. అది సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. భూ నిర్వాసితుల సమస్యలను అప్పటి ఎమ్మెల్యే వారితో దురుసుగా ప్రవర్తించి జఠిలం చేశామన్నారు. ఈ సమస్యపై అప్పటి మంత్రి హరీశ్ రావు సానుకూలంగా స్పందించినా, స్థానిక ఎమ్మెల్యే వైఖరి కారణంగా అది ముందుకు సాగలేదన్నారు. డబుల్ బెడ్ రూంలు తమ విధానం కాదని.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అప్పటి సర్కారు అనాలోచితంగా వ్యవహరించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు గుప్పించారు.

# నగర పోలీస్ కమిషన్‌గా కొత్తకోట బాధ్యతలు

- డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటాం
- క్విక్ రెస్పాన్‌గా పనిచేస్తామని కమిషనర్ హామీ



**హైదరాబాద్,డిసెంబర్13 :** నగర పోలీస్ కమిషనర్‌గా కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ లో సీపీగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..డ్రగ్స్ ను వినియోగించినా.. ప్రోత్సహించి నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పబ్స్, బార్ల దగ్గర డ్రగ్స్ విక్రయించే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశాంచారని సీపీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.. చట్టాలను గౌరవించే వారితో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుంద న్నారు. సినీరంగంలో డ్రగ్స్ వినియోగం ఎక్కువగా ఉందని.. డ్రగ్స్ నివారణకు పబ్స్, ఫాంహౌజ్ ఓనర్లు సహకరించాలని.. ఎలాంటి డ్రగ్స్ వినియోగించకుండా జాగ్రత్త తీసుకోవాలని కోరారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత శ్రీనివాస్‌రెడ్డికి ప్రాధాన్యత గల పోస్టింగ్ మొదటి సారి వచ్చింది. గతంలో గ్రే హౌండ్స్, అక్టోఫస్‌లో ఆయన పనిచేశారు. నూతన సీపీ కొత్త కోట శ్రీనివాస్ రెడ్డికి ముక్కుసూటి అధికారిగా పేరు ఉంది. తన శక్తి సామర్థ్యాలు గుర్తించి సీపీగా బాధ్యతలు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజే శారు. ఇప్పుడు హైదరాబాద్ మహా నగరంలో డ్రగ్స్, జూదంను నిర్మూలిస్తామన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా మీడి యా ఉంటుందని తెలిపారు. ప్రజాభిప్రాయాన్ని మీడియా ద్వారా తెలియజేయాలని కోరుతున్నానన్నారు. మెట్రో పాలిటీన్ సిటిలో మూడు అంశాలపై అలెర్ట్ ఉండాలన్నారు. సంఘటన జరిగినప్పుడు పోలీస్ క్విక్ రెస్పాన్స్ అనేది చాలా ప్రధానమని చెప్పుకొచ్చారు. మహిళల వేధింపులు, ర్యాగింగ్‌లపై షీ టీమ్స్ ద్వారా మరింత పని తీరును మెరుగు పరుస్తామన్నారు. తెలంగాణా స్టేట్‌తో పాటు హైదరాబాద్‌ను డ్రగ్ ఫ్రీ సిటీగా తీర్చి దిద్దాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చారన్నారు. హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, రాచకొండ కమిషనర్లతో కూడా సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తామన్నారు. డ్రగ్స్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాడమే తమ లక్ష్యమన్నారు. గతంలో డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపారన్నారు. హైదరాబాద్, తెలంగాణాను డ్రగ్స్ ముఠాలు వదిలి వెళ్ళాలని.. లేకపోతే ఉక్కుపాదం మోపుతామని డ్రగ్స్ ముఠాను హెచ్చరించారు. సినీ ఇండస్ట్రీలో కూడా డ్రగ్స్ సేవిస్తున్నట్లు గుర్తించామన్నారు. మారకపోతే సినీ ఇండస్ట్రీలో ఉన్న వారిపై కూడా ఉక్కుపాదం మోపుతామన్నారు. సినీ పెద్దలతో త్వరలో మీటింగ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

# పార్లమెంట్‌పై దాడికి 22 ఏళ్లు

- అమరుల త్‌ఆయగం మరువలేనిది
- రాష్ట్రపతి, ప్రధాని మోడీ నివాళి



**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** 2001లో జరిగిన పార్లమెంట్ పై జరిగిన దాడిలో అమరులైన వీర భద్రతా సిబ్బందిని స్మరించుకోవడం ఈ రోజు ప్రత్యేకత. వారికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తూ.. దేశభక్తిని చాటుకోవడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ ప్రత్యేకమైన రోజును పురస్క రించుకుని ప్రధాని మోదీ ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఆపదను ఎదుర్కొన్న వారి ధైర్యం, త్యాగం మన దేశం స్మృతి చిహ్నాల్లో ఎప్పటికీ నిలిచిపోతుం దని రాసుకొచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఇతర నేతలు పార్లమెంటుకు హాజరై వీర జవాన్లకు నివాళులర్పించారు. పార్లమెంట్ దాడి జరిగి నేటికి 22 ఏళ్లు. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా, జైషే మహ్మద్ సంస్థల ఉగ్రవాదులు డిసెంబర్ 13, 2001న పార్లమెంట్ కాంప్లెక్స్‌పై దాడి చేసి తొమ్మిది మందిని చంపారు. ఈ దాడిలో మొత్తం ఐదుగురు ఉగ్రవాదు లను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి.2001లో పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడిలో తమ ప్రాణాలను అర్పించిన ధైర్యవంతులైన భద్రతా సిబ్బందికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని అధ్యక్షుడు ద్రౌపది ముర్ము అన్నారు మరియు ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టే ప్రతిజ్ఞను అందరూ పునరుద్ఘాటించాలని కోరారు. 22 ఏళ్ల క్రితం ఇదే రోజున, దేశంలోని అగ్రశ్రేణి రాజకీయ నాయకత్వాన్ని నిర్మూలించి, మన ప్రజాస్వామ్య దేవా లయాన్ని దెబ్బతీయాలని ఉగ్రవాదులు వేసిన నీచమైన పథకాన్ని, మాతృ భూమి కోసం తమ ప్రాణాలను అర్పించిన తొమ్మిది మందితో సహా వీర భద్రతా సిబ్బంది భగ్నం చేశారు.,'ముర్ము ఒక పోస్ట్‌లో తెలిపారు. దేశం ఎప్పటికీవారిరుణంలో ఉంటుందని ఆమె అన్నారు. 'ప్రతిచోటా మాన వాళికి ముప్పుగా ఉన్న ఉగ్రవాదాన్ని అన్ని రూపాలు మరియు వ్యక్తీకర ణలలో – తుడిచిపెట్టడానికి మా ప్రతిజ్ఞను మేము ఈ రోజు పునరుద్ఘాటి స్తున్నందున వారి త్యాగం వృథా కాదు' అని రాష్ట్రపతి అన్నారు.

# ఆస్పత్రిలో కోమటిరెడ్డికి కవిత పరామర్శ



**హైదరాబాద్,డిసెంబర్13 :** రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనారోగ్యంతో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఢిల్లీ నుంచి ర ఆగానే ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. వెంకట్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి త్వరగా కోలుకోవాలని కవిత ఆకాంక్షించారు.

# అబద్దాల ప్రచారంతో కాంగ్రెస్ గద్దెనెక్కింది

- మేం చర్యలు తీసుకుంటే సగం మంది జైల్లో ఉండేవారు
- నర్సాపూర్ సభలో ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

**మెదక్,డిసెంబర్13 :** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ వాళ్లు గ్లోబెల్స్ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారని తెలిపారు. నిజం గడప దాటే లోపు అబద్ధం ఊరంతా తిరిగివచ్చినట్టు అయ్యిందని ఎద్దేవా చేశారు. కెసిఆర్‌కు పనితనం తప్ప పగతనం తెలియదన్నారు. నిజంగా కెసిఆర్ అనుకుంటే సగం మంది కాంగ్రెస్ నాయకులు జైల్లో ఉండేవారని హెచ్చరించారు. హౌసింగ్ స్కాములపై సిఐడి విచారణ చేస్తే పెద్ద రిపోర్ట్ వచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇదిలావుంటే పార్లమెంటులో జరిగిన భద్రతా వైఫల్య ఘటనపై మాజీ మంత్రి హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. ఈ రోజు పార్లమెంట్ లో జరిగిన ఘటన బాధాకరం అని అన్నారు. తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్ రావు అన్నారు. అత్యంత భద్రతతో కూడిన పార్లమెంటులో ఎంపీలకే భద్రత కరువైందని అన్నారు. కొత్త పార్లమెంటు కట్టి ఏం లాభమని హరీశ్ రావు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ పెద్దల మాటలు ఘనంగా ఉంటాయని, చేతల్లో మాత్రం ఆ ఘనం లేదని విమర్శించారు. కాంగ్రెస్ వాళ్ళు గోబెల్స్ ప్రచారం చేశారు. మనం చేసిన కృషి నిలకడ మీద తెలుస్తుంది. పని తనం తప్ప పగ తనం తెలియని నాయకుడు కేసీఆర్. కాంగ్రెస్ నేతల హౌసింగ్ స్కాం మీద రిపోర్ట్ వస్తే ప్రజా సంక్షేమమే ముఖ్యమని మనం దృష్టి పెట్టాం. పగ మీద దృష్టి పెట్టలేదు. మన ప్రభుత్వం ఉన్నప్పుడు అరెస్టులు చేసి ఉన్నట్లయితే కాంగ్రెస్ నాయకులు సగం మంది జైళ్లలో ఉండేవారు. కానీ మనం అలా చేయలేదు. గెలుపు ఓటములు సహజం ఒలికిపోయిన పాల గురించి ఆలోచన వద్దు. భవిష్యత్తులో సాధించే విజయం గురించి ఆలోచిద్దాం. అందరం కలిసి శ్రమించి విజయం వైపు వెళ్దాం. బీఆర్ఎస్ పార్టీకి ఒడిదొడుకులు సహజం. 2001 నుండి ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొన్నాము. ఎదిగినా ఒదిగి పని చేశాం. పాలు, నీళ్ళు ఏంటి అనేది నాలుగు రోజుల్లో ప్రజలు గుర్తిస్తారు. అధికార పక్షం అయినా, ప్రతి పక్షం అయినా మేం ప్రజల పక్షం. ఇచ్చిన హామీలు అమలు చేసేలా పోరాటం చేస్తాం. నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ ఆందోళన వద్దు. నర్సాపూర్ లో అన్ని మండలాలు మంచి లీడ్ ఇచ్చాయి. అందరూ బాగా కష్ట పడ్డారు' అని హరీశ్ రావు భరోసా కల్పించారు.నర్సాపూర్ లో నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో మాజీ మంత్రి హరీశ్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో 2001లో పార్లమెంట్‌పై జరిగిన దాడి గుర్తుకు వస్తుందన్నారు. పార్లమెంట్ సభ్యులందరి భద్రత కోసం ప్రార్థిస్తున్నామని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ లో పోస్టు చేశారు. అందరూ కష్టపడ్డారు. నర్సాపూర్ లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టేలా చేశారు. శిరస్సు వంచి నమస్కారం తెలియచేస్తున్నాను. కష్టపడిన వారిని కచ్చితంగా గుర్తు పెట్టుకుంటాం. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపిస్తాం. పార్టీ ఓటమి అనేది ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమే. గమ్యం చేరేది మన బీఆర్ఎస్ పార్టీ నే. మన మానసిక స్థైర్యాన్ని దెబ్బకొట్టే ప్రయత్నం అధికార పక్షం చేస్తుంది. ఫోన్ చేస్తే గట్టిగా గంటలో అందుబాటులో ఉంటాను. మీ ఎమ్మెల్యే సునితమ్మతో పాటు నేను అందుబాటులో ఉంటా.పని తనం తప్ప పగతనం తెలీదన్నారు.

# పార్లమెంటులో ఇద్దరు ఆగంతకుల కలకలం

సభ్యుడు కార్తీ చిదంబరం మాట్లాడుతూ అకస్మాత్తుగా ఇద్దరు యువకులు విజిటర్స్ గ్యాలరీలోంచి సభలోకి దూకారు. వారి చేతిలో ఉన్న పొగడబ్బాలలోంచి పసుపు రంగులో పొగ వెలువడుతోంది. వారిలో ఒకడు స్పీకర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఇది పార్లమెంటులో భద్రతావైఫల్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఆగంతకులు చొర్బుకురావడంపై ఎంపీ రఘురామ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాంటి ఘటన జరిగిందన్నారు. దీని వెనుక ఎవరున్నారు అనేది తేలుతుందని అన్నారు. లోక్ సభలో జరిగిన ఘటనపై స్పందించిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) ఎంపి డింపుల్ యాదవ్ ట్వీట్ చేశారు. ఇది లోక్‌సభలో భద్రతా ఉల్లంఘన అని.. ఇక్కడికి వచ్చే వారందరూ – అది సందర్శకులు లేదా రిపోర్టర్‌లు.. వారు ట్యాగ్‌లను కలిగి ఉండరు. కాబట్టి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని నేను భావిస్తున్నాను. ఇది పూర్తి భద్రతా లోపం అని నేను భావిస్తున్నాను. లోక్‌సభ లోపల ఏదైనా జరిగి ఉండవచ్చని అంటూ డింపుల్ యాదవ్ ట్వీట్ చేశారు. పార్లమెంట్‌లో బుధవారం మధ్యాహ్నం 1.02 గంటలకు జీరో అవర్‌లో ఇద్దరు వ్యక్తులు గుర్తు తెలియని పసుపు రంగు పొగను వెదజల్లుతూ సందర్శకుల గ్యాలరీ నుంచి దూకి లోక్‌సభ ఛాంబర్‌లోకి పరుగె త్తడంతో భద్రతా ఉల్లంఘన జరిగింది.

# స్థానిక పోరుకు సై అంటే సై అంటున్న నాయకులు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా పరిషత్ ను చేజిక్కించుకొని తన ప్రభావాన్ని చూపారు. ఎలాగూ ప్రభుత్వ పార్టీలోనే ఉన్న సంజయ్ కుమార్, ప్రభుత్వం నుండి భారీగా నిధులు రాబట్టడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చడం, వెరసి ఆయనకు అంది వచ్చిన అవకాశమును సక్రమంగా ఉపయోగించుకొని 2023 ఎన్నికల్లో తన సత్తా చాట గలిగాడు. ఇప్పుడు గ్రామపంచాయతీ ఎన్నికలు దగ్గర పడడంతో నియోజకవర్గంలోని మూడు మండలాలకు ప్రతినిత్యం వెళు తూ, ప్రజలతో మమేకమవుతూ, గ్రామాల్లోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అలాగే గ్రామస్తుల ముందుండే వారి సమస్యలపై సెల్ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడి ప్రజల్లో భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.

రెండు కోడెద్దుల మధ్యలోకి లేగదూడ ?

ఈ ఇద్దరు నాయకులు . కొత్త ప్రభుత్వం రావడం పాత పథకాల కొనసాగింపు తో పాటు కొత్త పథకాల మేళవింపుతో ఓటర్లను సంతృప్తి పరుస్తేనే నాయకుల ఉనికికి శ్రీరామరక్షగా మారి రాబోయే రోజుల్లో తమ రాజకీయ భవిష్యత్తుకు దోహదపడుతుందని రాజకీయ విశ్లేషకుల అంచన. రాజకీయ ఉద్ధండుడు జీవన రెడ్డి, పదేళ్ళ రాజకీయ అనుభవంతో ఎమ్మెల్యే గా ఉన్న సంజయ్ కుమార్ లకు పోటీగా మొదటిసారి మూడో వ్యక్తి వీరిద్దరికి పోటీ ఇవ్వబోతున్నారు. ఎన్నడు లేని విధంగా గత శాసన సభ ఎన్నికల్లో గత 50 ఏళ్ల ఎన్నికల రాజకీయాలలో లేని తీరుణ, బిజెపి అభ్యర్థి రూపంలో బొగ శ్రావణి అనే కొత్త నాయకురాలు రంగంలోకి దిగి, ఇద్దరినీ చివరివరకు భయపెట్టింది. మొదటి సారి గా జగిత్యాల ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరగడం, బిజెపి గత చరిత్ర చూసిన వారెవరు ఊహించని రీతిలో గ్రామీణ ప్రాంత ఓటర్లతో పాటు, జగిత్యాల పట్టణ ఓటర్లను ఆకట్టుకొన్న బొగ శ్రావణి నాయకత్వ ప్రతిభ, రాబోయే రోజుల్లో జగిత్యాల నుండి మరో కొత్త రాజకీయ కేంద్రం ఏర్పడబోతుందని పరిశీలకులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో మొదటిసారిగా బజజప్ పారీకి 40 వేల వోట్లు దాటడం, ఓట్ల లెక్కింపు రోజు, చివరి వరకు ఉత్కంఠను కల్గించడానికి పార్టీకన్నా, బొగ శ్రావణి అభ్యర్థిగానే ఎక్కువ ప్రభావం చూపిందాని అనుకొంటున్నారు.

## శ్రావణ పూర్ణిమ వెన్నెలలో కమలం వికసిస్తుందా ?

బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బోగ శ్రావణి సైతం త్రిముఖ పోటీలో గ్రామాల్లో ముఖ్యంగా యువకులు మహిళల ఆదరణతో పాటు, జగిత్యాల పట్నంలో సైతం ఓట్లను రాబట్టడంతో కమలం శ్రేణుల్లో కొత్త ఆశలు చిగురించాయి. దీంతో తిరిగి గ్రామపంచాయతీలో పాగా



వేయాలని అధిక స్థానాలు కైవసం చేసుకోవాలని శ్రావణి సైతం గ్రామాలకు తరలండి అన్నట్లుగా తన దృష్టిని పంచాయతీ ఎన్నికల్లో నిలుపడానికి వ్యూహాలు ఖరారు చేసుకుంటుంది రాబోయే పార్లమెంట్ ఎన్నికల వరకు జగిత్యాల సెగ్మెంట్లో బిజెపి తన పట్టుతో పాటు , తన నాయకత్వాన్ని కూడా పటిష్టం చేసుకొని, నియోజకవర్గంపై పట్టు నిలుపుకొని, విజయ కేతనం ఎగురవేయడానికి పావులు కదుపుతోంది. ఆరితేరిన నాయకురాలిగా, అప్పుడే గ్రామాలలో పర్యటనలు చేస్తూ, స్థానిక ఎన్నికల్లో కమల వికాసానికి కృషి చేస్తుంది. కాంగ్రెస్, భారాసల మధ్య కొత్త కెరటాలు ఏ తెరానికి చేరుతాయో.

## ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుడియోసాయ్ ప్రమాణం



**రాయ్‌పూర్,డిసెంబర్13 :** ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుడియోసాయ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ సీఎంలుగా అరుణ్ సావో, విజయ్ శర్మ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. రాయ్‌పూర్‌లో జరిగిన ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, యూపీ సిఎం యోగి ఆదిత్యనాథ్, అసోం సీఎం హిమంత బిస్వాశర్మ, ఛతీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ భగేల్‌తోపాటు పలువురు నాయకులు హాజరయ్యారు. విష్ణుడియో సాయ్ గతంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. అంతేగాక ప్రధాని నరేంద్రమోడీ తొలి క్యాబినెట్‌లో కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు.

## ధరణి అవకతవకలపై ప్రభుత్వం దృష్టి

### ఉన్నతస్థాయి సమీక్షించిన సిఎం రేవంత్





**హైదరాబాద్,డిసెంబర్13 :** ధరణి పోర్టల్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. సమీక్షకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క, మంత్రులు పొంగులేటి, దమో దర రాజనర్సింహ, పలువురు ఉన్నాతా ధికారులు హాజరయ్యారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి నిమగ్నమయ్యారు. ధరణి పోర్టల్‌లో నెలకొన్న సవాళ్లు, సమస్యలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. ధరణి పోర్టల్ చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. అదనంగా, ప్రతి మండలంలో ప్రతినెలా రెవెన్యూ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుండి, వారి భూమి హక్కులను కోల్పోతున్నట్లు క్లెయిమ్ చేస్తూ వ్యక్తుల నుండి అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఒత్తిడిని కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని భావిస్తోంది.

## దొంగలదాడిలో గాయపడ్డ యువకుడి మృతి

**వరంగల్,డిసెంబర్13 :** దొంగలు కొట్టిన కేసులో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని గుర్తుతెలియని దుండగులు కొట్టి చంపి దోచుకున్న దారుణ సంఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. వరంగల్ లో డిసెంబర్ 5వ తేదీన వరంగల్ బస్టాండ్ వద్ద రాకేష్ అనే యువకుడు నడుచుకుంటూ వెళ్తుండగా అటుగా ఆటోల వచ్చిన యువకులు అతడిపై దాడి చేసి అతని వద్ద ఉన్న బంగారం గొలుసు ఉంగరాలను దోచుకెళ్లారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి అనుమానాస్పద స్థితిలో పడి ఉన్న రాకేష్ ను స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఎంజీఎం హాస్పిటల్ తరలించారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేష్ బుధవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరుకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

## నక్సల్స్ బాంబుకు జవాన్ బలి

**రాయ్‌పూర్,డిసెంబర్13 :** ఛత్తీసగఢ్‌లో నక్సల్స్ రెచ్చిపోయారు. నారాయణ్‌పూర్ అమ్‌దై మైన్స్‌లో నక్సల్స్ అమర్చిన ఐఈడీ పేలి ఓ జవాన్ ప్రాణాలు కోల్పోయాడు. మరో సైనికుడు గాయపడ్డాడు. గనుల్లోని పలుచోట్ల ఐఈడీలను అమర్చుతామని నక్సల్స్ హెచ్చరించారు. గతంలో ఐఈడీ పేలుడులో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.నక్సల్స్ ఐఈడీ దాడిలో సైనికుడిని కమలేష్ సాహుగా గుర్తించారు. ఆయన స్వస్థలం జంజ్‌గిర్ చంపా జిల్లా హసౌద్ గ్రామం. నారాయణ్‌పూర్ లోని ఛోటెడోంగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్‌దై గనిలో ఉదయం నక్సలైట్లు ఐఈడీని పేల్చడంతో పాటు కాల్పులు జరిపారని బస్తర్ ఐజీ సురందర్ రాజ్ తెలిపారు. నక్సల్స్ దాడిలో సీఎఎఫ్ 9 వ కార్ప్‌కు చెందిన కానిస్టేబుల్ కమలేష్ కుమార్ వీర మరణం పొందారని తెలిపారు. కానిస్టేబుల్ వినయ్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయని చెప్పారు. ఈ సంఘటన తరువాత పరిసర ప్రాంతాల్లోపోలీస్ బలగాలు , డీఆర్‌జీ, ఐటీబీపీ బలగాలు తనిఖీలు నిర్వహించాయి. ఇదిలా ఉండగా ఈనెల 9 న ఛోటాదొంగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లిన బీజేపీ నేత కోమల్ మాఝీని నక్సల్స్ చంపేశారు.మరోవైపు నారాయణ్‌పూర్ గనుల వద్ద మోహరించిన 16 వాహనాలను నక్సల్స్ దగ్ధం చేశారు. పలువురు ఉద్యోగులను బందీలుగా పట్టుకున్నారు.

# స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ ఎన్నిక లాంఛనమే

### ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవం

### నేడు అధికారికంగా ప్రకటన..








**హైదరాబాద్,డిసెంబర్13 :** అసెంబ్లీ స్పీకర్ పదవి కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంఐఎం, సీపీఐ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తదితరులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గడ్డం ప్రసాద్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం కానుంది. గురువారం ఆయన అసెంబ్లీలో స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. పోటీలో ఎవరూ లేకపోవడంతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. నామినేషన్లకు గడువు బుధవారం సాయంత్రంతో ముగిసింది. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పదవికి ఒకే ఒక నామినేషన్ దాఖలు అయింది. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం ప్రసాద్ అసెంబ్లీ స్పీకర్‌గా నామినేషన్ వేశారు. రేపు సభలో ప్రొటెం స్పీకర్ అధికారికంగా అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటించనున్నారు. బుధవారం ఉదయం అసెంబ్లీ స్పీకర్ పదవి కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజార్టీ ఉండడంతో స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు మద్దతు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చింది. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు సైతం నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్పీకర్గా గడ్డం ప్రసాద్ ఏకగ్రీవం కానున్నారు. 15న అసెంబ్లీ, మండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. 16న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తీర్మానం చేయనున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్ నియోజకవర్గం నుండి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. గడ్డం ప్రసాద్ రాజకీయ ప్రస్థానం 2008లో మొదలయ్యింది. ఇప్పటివరకు మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండుసార్లు ఓడిపోయారు. ఓటమితో పార్టీ మారలేదు. నియోజకవర్గాన్నీ మార్చలేదు. వికారాబాద్ నే అంటిపెట్టుకుని ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. 2008లో తొలిసారిగా వికారాబాద్ నుంచి గెలుపొందిన ఆయన 2009లో మళ్లీ వికారాబాద్ నుంచి గెలుపొందారు. 2014, 2018లో వికారాబాద్ నుండి రెండుసార్లు ఓడిపోయారు. కానీ 2023లో మళ్లీ గెలిచారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి 3వ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 2012లో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్లో పనిచేశారు. టెక్స్ టైల్ శాఖా మంత్రిగా సేవలందించారు. రాష్ట్ర విభజన, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. 2018 ఎన్నికల్లో కూడా ఆయన పరాజయాన్ని చవిచూశారు. 2018 తర్వాత గడ్డం ప్రసాద్ కుమార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2022 డిసెంబర్ 10న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా గడ్డం ప్రసాద్ కుమార్ నియమితులయ్యారు. ఆ తర్వాత 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గం నుండి పోటీ చేశారు. ఈసారి ఎన్నికల్లో గడ్డం ప్రసాద్ కుమార్ విజయాన్ని సాధించి స్పీకర్గా నియమితులయ్యారు.

# మహదేవ్ బెట్టింగ్ యాప్

### రవి ఉప్పల్ దుబాయ్‌లో అరెస్ట్





**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** దేశంలో ఇటీవల కలకలం సృష్టించిన మహదేవ్ బెట్టింగ్ యాప్ మనీలాండరింగ్ వ్యవహారానికి సంబంధించి యాప్ యజమానుల్లో ఒకరైన రవి ఉప్పల్ ను దుబాయ్‌లో అదుపు లోకి తీసుకున్నారు. ఈడీ అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీస్ ఆధారంగా గత వారమే పోలీస్‌లు రవిని అదుపు లోకి తీసుకున్నారు. అతడిని భారత్‌కు తీసుకు వచ్చేందుకు దుబాయ్ అధికారులతో ఈడీ సంప్రదిస్తోంది. మరో యజమాని సౌరభ్ చంద్రశేఖర్ కోసం దుబాయ్ పోలీస్‌లు గాలిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ లోని భిలాల్ ప్రాంతానికి చెందిన రవి ఉప్పల్, సౌరభ్ చంద్రశేఖర్ దుబాయ్ కేంద్రంగా భారత్‌లో మహదేవ్ బెట్టింగ్ యాప్ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ పేరున మనీలాండరింగ్ సాగిస్తున్నారు. దీనిపై ఈడీ రంగం లోకి దిగి ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న కోల్‌కతా, భోపాల్ ముంబై వంటి నగరాల్లో సోదాలు చేపట్టింది.రూ. వందల కోట్లలో అక్రమ నగదు బయటపడింది. యాప్ ద్వారా వచ్చే మొత్తాన్ని ఆఫ్‌షోర్ ఖాతాలకు తరలించేందుకు హవాలా మార్గాన్ని అనుసరిస్తున్నట్టు ఈడీ గుర్తించింది. ఈ కేసులో ఈడీ ఇప్పటికే ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. రవి ఉప్పల్‌కు వనౌటు దేశ పాస్‌పోర్ట్ ఉందని దాన్ని ఉపయోగించి అనేక దేశాల్లో తిరుగుతున్నాడని దర్యాప్తులో తేలింది. భారత పౌరసత్వాన్ని వదులుకోక పోయినా, దీని పైనే ఆస్ట్రేలియా వీసా కోసం దరఖాస్తు చేసుకున్నట్టు ఈడీ తెలిపింది. యాప్ మరో ప్రమోటర్ సౌరభ్ చంద్రశేఖర్‌కు ఈ ఏడాది ఫిబ్రవరిలో యూఏఈ లో ఘనంగా వివాహం జరిగింది. దీనికోసం రూ.200 కోట్లు ఖర్చు చేసినట్టు ఈడీ గుర్తించింది. ఈ పెళ్లికి బాలీవుడ్ లోని ప్రముఖ సెలబ్రిటీలు కూడా హాజరైనట్టు ఈడీ పేర్కొంది. ఈ కేసులో రవి ఉప్పల్, సౌరభ్ చంద్రశేఖర్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. ఈడీ అభ్యర్థన మేరకు వీరిద్దరిపై ఇంటర్ పోల్ రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేసింది. అయితే ఈ మనీలాండరింగ్ ఆరోపణలను రవి ఉప్పల్, సౌరభ్ చంద్రశేఖర్ ఖండించారు. దీంతో తమకెలాంటి సంబంధం లేదని, శుభమ్ సోని అనే వ్యక్తి ఈ యాప్‌ను నడిపిస్తున్నాడని వారు పేర్కొన్నారు. ఈ బెట్టింగ్ యాప్ వ్యవహారంలో ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్ పైనా ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. బఘేల్‌కు ఈ యాప్ ప్రమోటర్లు రూ.508 కోట్లు చెల్లించినట్టు క్యాష్ కొరియర్ ఆసిమ్‌దాస్ తన వాంగ్మూలంలో చెప్పాడని ఈడీ ఆరోపించింది. చత్తీస్‌గఢ్ ఎన్నికలకు ముందు ఆసిమ్‌ను పోలీస్‌లు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ. 5 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ డబ్బును తనకు శుభమ్ సోని ఇచ్చాడని ఆసిమ్ చెప్పినట్టు ఈడీ పేర్కొంది. అయితే అధికారులు తమతో బలవంతంగా వాంగ్మూలంపై సంతకం చేయించినట్టు ఆసిమ్ జైలు అధికారికి తెలియజేస్తూ లేఖ రాసినట్టు వార్తలు వచ్చాయి.

## రెండో రోజూ కొనసాగిన సమ్మె



**శ్రీకాకుళం,డిసెంబర్13 :** కనీస వేతనం రూ 26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన సమ్మె శ్రీకాకుళం జిల్లాలో రెండో రోజూ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు మూత పడ్డాయి. పలు ప్రజా, కార్మిక సంఘాల నాయకులు సమ్మె శిబిరాలకు హాజరై సంఘుభావం ప్రకటించారు. శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ వద్ద నిర్వహించిన ధృణలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కల్యాణి మాట్లాడుతూ తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొన సాగిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు అల్లు సత్యనారాయణ, యూనియన్ నాయకులు టి రాజేశ్వరి, ప్రమీలదేవి తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ భద్రతపై అనుమానాలు



### దుండుగులు లోపలకి ఎలా వచ్చారన్నదే ప్రశ్న

**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** పార్లమెంట్‌లోకి ఇద్దరు దుండగులు ప్రవేశించి అలజడి సృష్టించిన నేపథ్యంలో పార్లమెంట్ వద్ద చొటోచేసుకున్న భద్రతా వైఫల్యాలు కొత్త పార్లమెంట్ వద్ద భద్రతా వ్యవస్థపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. గతంతో పోలిస్తే పార్లమెంట్ వద్ద భద్రతా వ్యవస్థ మరింత మరింత పటిష్టం చేసినప్పటికీ స్మోక్ బాంబులతో ఇద్దరు వ్యక్తులు విజిటర్స్ గ్యాలరీలోకి ఎలా ప్రవేశించగలిగారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. 2001లో పార్లమెంట్‌పై దాడి జరిగిన తర్వాత పాత పార్లమెంట్ భవనం వద్ద భద్ధతను ప్రక్షాళన చేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థ స్థానంలో నాలుగు అంచెల భద్రతా వ్యవస్థ అమలులోకి వచ్చింది. పార్లమెంట్ వద్ద ఢిల్లీ పోలీసుకు చెందిన ప్రత్యేక విభాగంతోపాటు సిఆర్‌పిఎఫ్‌కు చెందిన ఒక కంటింజెంట్‌ను ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరీ ఫోర్స్, అగ్నిమాపక దళంతోసహా ఇతర సంస్థలను భద్రతా వ్యవస్థలో మమేకం చేశారు. భద్రతా పక్రియలో భాగంగా పార్లమెంట్ వద్ద సందర్శకులను క్షుణ్ణంగా తనిఖీలు చేయడం జరుగుతుంది. భైతిక తనిఖీలతోపాటు సందర్శకుల వద్ద ఉండే వస్తువులన్నిటినీ క్షుణ్ణంగా తనిఖీ జరుగుతుంది. ఫోన్లు, బ్యాగులు, నీళ్ల బాటిళ్లతోపాటు చిల్లర నాణెలిలను సైతం లోపలకు అనుమతించరు. సందర్శకులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డులను చూపించాల్సి ఉంటుంది. మూడు ఫుల్ బాడీ స్కానర్లను దాడుటకునే లోపలకు ప్రవేశం ఉంటుంది. ఈ పక్రియ అంతా పూర్తయిన తర్వాతే సందర్శకులకు పాసులు జారీ చేస్తారు. సందర్శకుడి నేపథ్యాన్ని గురించి ఆరా తీసిన తర్వాత పాసుల జారీ జరుగుతుంది. పార్లమెంట్ సభ్యుడు సంతకం చేసిన సిఫార్సు లేఖలపైనే పాసులు జారీ చేస్తారు. పార్లమెంట్‌లోని విజిటర్స్ గ్యాలరీలోకి ప్రవేశించిన ఆ ఇద్దరు వ్యక్తులు స్మోక్ బాంబులను తమ షూ లోపల దాచి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారిని తనిఖీ చేస్తున్న సమయంలో షూల విషయాన్ని భద్రతా సిబ్బంది విస్మరించి ఉంటారని భావిస్తున్నారు. అయితే ఫుల్ బాడీ స్కానర్లను వారిద్దరూ ఎలా తప్పించుకుని ఉంటారన్నది మాత్రం అంతుచిక్కడం లేదు.

## రెండో రోజుకి అంగన్వాడీలు సమ్మె

### సమస్యల పరిష్కారం కోసం డిమాండ్



**కాకినాడ ,డిసెంబర్13 :** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన నిర్వాదిక సమ్మె రెండో రోజు కొనసాగుతుంది. కాకినాడ ఇంద్ర పాలెం లాకులు వద్ద కాకినాడ అర్బన్, రూరల్, పెదపూడి, కరప మండలాలకు చెందిన అంగన్వాడీలు వందల సంఖ్యలో బుధవారం కూడా సమ్మె శిబిరానికి చేరుకున్నారు. సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.చంద్రావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి విడిచిపెట్టి న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీను అమలు చేయమని అడుగుతుంటే ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్చలకు పిలిచి బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. శక్తికి మించి పనిచేస్తున్నా అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. పని ఒత్తిడి తట్టుకోలేక అనేకమంది అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవలు అందిస్తున్న తామంతా ఇబ్బందులకు గురవుతున్నామని, విధలేని పరిస్థితుల్లోనే ఈ సమ్మెకు దిగాల్సి వచ్చిందని ఆమె స్పష్టం చేశారు

# పార్లమెంటులో అలజడి కారకులు కన్నడిగులు

బిజెపి ఎంపి ప్రతాప్ సింహా జారీ చేసిన పాసులుగా గుర్తింపు

**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** స్మోక్ బాంబులతో పార్లమెంట్ లోపలకు ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులకు పాసుల జారీకి సిఫార్సు చేసిన ఎంపీ ఎవరన్న విషయమై వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. బుధవారం లోక్‌సభ విజిటర్స్ గ్యాలరీలోకి ప్రవేశించిన ఆ ఇద్దరు వ్యక్తులు అక్కడి నుంచి సభ్యులు కూర్చున్న సీట్ల పైకి దూకి అలజడి సృష్టించిన నేపథ్యంలో వారికి విజిటర్స్ పాసుల అనుమతి వెనుక ఎవరు ఉన్నారన్న విషయాలు వెలుగు చూస్తున్నాయి. బిజెపి ఎంపి ప్రతాప్ సింహ్ కార్యాలయం నుంచే వారికి పాసులు జారీ అయినట్లు తెలుస్తోంది. కర్నాటకలోని మైసూరుకు చెందిన ఎంపి ప్రతాప్ సింహ కార్యాలయం నుంచే వారిద్దరికీ పాసులు జారీ అయినట్లు పోలీసులు తెలిపారు. ఆ ఇద్దరు వ్యక్తులలో ఒకరు సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజవకర్గానికి చెందిన వ్యక్తని వారు చెప్పారు. 35 ఏళ్ల డి మనోరంజన్ మైసూరులోని వివేకానంద్ యూనివర్సిటీ నుంచి బిటెక్ చదివాడు. అతని తండ్రి మైసూరులోని విజయ్‌నగర్‌లో నివిస్తున్నారు. 2014లో మైసూరు నియోజకవర్గం నుంచి 43.46 శాతం ఓట్లు సాధించి గెలుపొందిన సింహ 2019 ఎన్నికలలో తన ఓట్ల వాటాను 52.27 శాతానికి పెంచుకున్నారు. మాజీ జర్నలిస్టు అయిన 42 ఏళ్ల సింహ తన వ్యాసాల ద్వారా పేరు పొందారు. 2007లో ప్రధాని నరేంద్ర మోడీపై జీవిత కథ రాసిన సింహ ప్రధాని మోడీని తాను ఆరాధిస్తానని గతంలో చెప్పారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో డి మనోరంజన్, సాగర్ శర్మ లోక్‌సభ విజిటర్స్ గ్యాలరీ నుంచి ఛాంబర్‌లోకి దూకారు. ఎంపీలు కూర్చునే డెస్కులపైకి దూకిన సాగర్ స్పీకర్ కుర్చీ వూసు పరుగెత్తడం టివి ఫుటేజ్ చూపింది. ఈ సమయంలో మనోరంజన్ ఒక స్మోక్ బాంబును ప్రయోగించగా పసుపు రంగు పొగ రావడం కనిపించింది. మనోరంజన్ ఎంపి కార్యాలయానికి తరచు వచ్చేవాడని వర్గాలు తెలిపాయి. బుధవారం ఎంపి కార్యాలయానికి వచ్చిన మనోరంజన్ సహ నిందితుడు సాగర్ శర్మను తన మిత్రుడిగా అక్కడి సిబ్బందికి పరిచయం చేశాడని వారు చెప్పారు. కొత్త పార్లమెంట్‌ను చూస్తామన్న నెపంతో సిబ్బంది నుంచి పాసులు పొందాడని వారు తెలిపారు. సింహ్ తరఫున మూడు పాసులు జారీ చేశారని, అయితే చంటిబిడ్డతో వచ్చిన ఒక మహిళ లోపలకు అనుమతించకపోవడంతో వాపసు వచ్చిందని, ఆమె పేరును పాసులో పేర్కొనలేదని వర్గాలు తెలిపాయి. ఇద్దరు నిందితులతో ఆ మహిళకు ఎటువంటి సంబంధం లేదని వారు చెప్పారు. పాసుల కోసం మూడు నెలలుగా మనోరంజన్ ఎంపిని, ఆయన కార్యాలయ సిబ్బందిని అడుగుతున్నాడని వర్గాలు తెలిపాయి. తమ నియోజకవర్గానికి చెందిన ప్రజల నుంచి అటువంటి విజ్ఞప్తులను ఎంపీలు మన్నించడం సాధారణమేనని ఎంపి కార్యాలయం తమ చర్యను సమర్థించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇలా ఉండగా పార్లమెంట్ వెలుపల రంగుల స్మోక్ బాంబులతో ఉన్న అమోల్ షిండే, నీలం దేవి అనే ఇద్దరు స్త్రీపురుషులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



# నిరుద్యోగులకు భరోసా కలిగించే చర్య !

నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్‌లైన్‌కు ఆకర్శితులై తెలంగాణ ఉద్యమంలో అమరులైన ఆత్మలు గత పదేళ్లుగా ఘోషిస్తున్నాయి. బతికున్న నిరుద్యోగులు ఉద్యోగాలు లేకుండా పొట్ట చేత పట్టుకుని నానా యాతన పడుతున్నారు. సిఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరవాత ఒక్కో రంగంపై సమీక్షిస్తూ సాగుతున్న తీరువల్ల ప్రజల్లో నమ్మకం కలుగుతోంది. ప్రధానంగా ఉద్యోగ నియామకాలు, ప్రైవేట్ ఫీజుల దోపిడీ, స్కూళ్ల మూసివేత వంటి వాటిపై చర్యలు తీసుకోవాలి. అలాగే నీళ్లు ఎవరికి పోయాయో గుర్తించాలి. కాళేశ్వరం పొడుగునా నీళ్లు ఎవరి పొలాలకు పారుతున్నాయో గుర్తించాలి. నియామకాలు ఎవరికి జరిగాయో..నిధులు ఎక్కడికి పోయాయో కూడా గుర్తించాలి. అప్పుడే తెలంగాణకు న్యాయం జరుగుతుంది. అమరుల ఆత్మలు శాంతిస్తాయి. ఈ క్రమంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. టీఎస్‌పీఎస్సీని సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. ఇందు కోసం యూపీఎస్సీతో పాటు ఇతర రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరును అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకాలు, నోటిఫికేషన్లకు సంబంధించి సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు నిరుద్యోగులకు ఆశాజనకంగా మారింది. ఇదొక్కటే కాకుండా గత పదేళ్లుగా లక్షన్నర ఉద్యోగాలు భర్తీ చేశామని బుకాయించిన కెసిఆర్ ప్రభుత్వం ఎక్కడెక్కడ ఏ ఉద్యోగాలు భర్తీ చేసిందో నిజాలు రాబట్టాలి. నిరుద్యోగులకు సంబంధించి తీసుకునే ఎలాంటి నిర్ణయమైనా తెలంగాణ యువతకు భరోసా కల్పించేదే. గత పదేళ్లుగా డిఎస్సీలు కూడా నిర్వహించకుండా స్కూళ్లను మూసేసారు. దీనిపైనా విచారణ జరపాలి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనతో పాటు.. అవకతవకలకు కారకులైన వారిని గుర్తించి బోనులో నిలబెట్టాలి. అలాగే సర్వీస్ కమిషన్ ద్వారా ఏటా జాబ్ క్‌ఆయలెండర్ విడుదల చేసేలా దానిని సంస్కరించాలి. అర్హులైన వారికే పదవులు కట్టబెట్టి సమర్థతను పెంచాలి. యూపీఎస్సీతో తరహాలో దీనిని పటిష్ట సంస్థగా తీర్చిదిద్దాలి. అక్రమాలకు తావులేకుండా పక్కా ప్రణాళిక అమలు చేస్తే..మంచిది. ఇకపోతే గతంలో ఘంటా చక్రపాణి కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో కొన్ని ఉద్యోగాల్లో కవిత ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపైనా విచారణ చేయాలి. కమిషన్ ద్వారా ఉద్యోగ నియామకాలు అత్యంత పారదర్శకతతో చేపట్టేందుకు కట్టు దిట్టమైన చర్యలు చేపట్టడం ద్వారా నిరుద్యోగులకు భరోసా కల్పించాలి. అలాగే ఛైర్మన్, సభ్యుల నియామకాలను సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పారదర్శకంగా ఉండేలా మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంది. కమిషన్‌కు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, కావాల్సిన సిబ్బంది, ఇతర సదుపాయాలను వెంటనే కల్పించాలని అధికారులను సిఎం ఇప్పటికే ఆదేశించారు కనుక ఈ విషయంలోనూ నిరుద్యోగులు భరోసాతో ఉండ వచ్చు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియామకాలు, నోటిఫికేషన్లకు సంబంధించి జరిగిన అవతవకలపై సమగ్ర విచారణ జరపాలి. ఇకపోతే గత ప్రభుత్వ హయాంలో ఇంటర్, పది పరీక్షల నిర్వహణ కూడా భ్రష్టు పట్టిపోయింది. ఈ విషయంలో వచ్చిన ఆరోపణలపైనా సిఎం రేవంత్ సమీక్షించి విచారణకు ఆదేశించడం ఆహ్వానించదగ్గ పరిణామం. త్వరలో జరుగనున్న పదోరగతి, ఇంటర్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గతంలో జరిగిన పేపర్ లీకేజీలు, ఇతర ఇబ్బందులను గుర్తించి పరీక్షల సమయం లో విద్యార్థులు ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా ఉండే విధంగా సాఫీగా పరీక్షలు నిర్వహించాలని సీఎం ఆదేశించినందున అధికారులు కూడా అందుకు తగ్గట్లుగా పనిచేయాలి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్

రంగంలో పనిచేస్తున్న విశ్వ విద్యాలయాల పనితీరుపై సవివరమైన నివేదిక అందచేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విశ్వ విద్యాలయాల పనితీరుపై సవివరమైన నివేదికతోపాటు, రాష్ట్రంలో ఎక్కడ జూనియర్ కళాశాలలు అవసరం ఉన్నాయో వాటి వివరాలు వెంటనే సమర్పించాలని కోరారు. ప్రధానంగా బాలికల కోసం జూనియర్ కళాశాలలు ఎక్కడ అవసరమో పరిశీలించి వాటికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో ప్రైవేట్ కార్పోరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపైనా దృష్టి సారించాల్సి ఉంది. లక్షల్లో ఫీజుల వసూళ్లను నియంత్రించాలి. పేద,మధ్య తరగతి ప్రజలకు పాఠశాల విద్యనఉ చేరువ చేసేలా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో అంచనాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆరు గ్యారంటీలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడంతో ఆ విజయం లభించింది. అందుకే ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆరు గ్యారంటీలు అమలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు ఆర్థికంగా బలపడేలా చూసుకోవాలి. ఆర్థిక దుబారాను అరికట్టడంతో పాటు, అధికారుల అవినీతిపైనా నిగ్గు తేల్చాలి. ఇవన్నీ ఒక్కొక్కటిగా చేసుకుంటూ పోతేనే సమర్థత బయటపడగలదు.

సమగ్ర దర్యాప్తుతోనే అవినీతి బయటపడగలదు. ఇప్పటికిప్పుడు కొత్తగా ఆలోచించుకుని సంపద సృష్టించుకుని వాటి ద్వారా ఆదాయాన్ని పెంచుకుని హామీలు అమలు చేయాల్సి ఉంటుంది. మేనిఫెస్టోలో పెట్టిన ఇతర హామీలు సంగతేమో కానీ.. ఆరు గ్యారంటీలను మాత్రం వంద రోజుల్లోనే అమలు చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారంలో ఎక్కడా అభివృద్ధి పనుల గురించి ఆలోచించాల్సిన పరిస్థితి ఉండదు. అందుకే తెలంగాణలో అభివృద్ధిపై సమర్థంగానే ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

# "బయో ఫ్యూయెల్ ప్రోత్సాహం అందించాలి"

## డిసెంబర్ 14... జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

జీవ ఇంధన వాడకం మానవునికి కొత్తేమి కాదు. మానవుడు మొదట నిప్పును సృష్టించిన తరువాత ఎండిన కర్రపుల్ల లు, చెట్లకాండాలు, ఆకులను నిప్పు పుట్టించే ఇంధనంగా వాడటం ప్రారంభించాడు. తరువాత జంతు, మొక్కల నుండి తీసిన నూనెలను కూడా ఇంధనంగా వాడేవాడు. ఆ తరువాత ఇళ్ళలో వంటలకు, ఇత రత్రా పనులకు కర్రలను, కర్రలను కాల్చగా ఏర్పడు బొగ్గులను ఇంధనంగా వాడటం అలవాటు చేసుకున్నాడు. ప్రస్తుతం విచ్చలవిడిగా అవసరానికి మించి వాడుతున్న నేలబొగ్గు (భూమిగర్భం నుండి త్రవ్వితీసిన బొగ్గు), ముడి పెట్రోలియం నుండి ఉత్పత్తి గావించే ఖనిజ నూనెలు, వాయువులు, పెట్రోలియం బావుల నుండి ప్రారంభంలో వెలువడు సహజ వాయువు వంటివి అన్నియు శిలాజ ఇంధనాలు. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమిమీద ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో భారీ ప్రమాణంలో భూమి మీది జీవరాశి అంతమయి, క్రమేణా భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. ఇప్పటికే 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగి పోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళి మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. ఉత్పత్తి ఐన వస్తువులు వేగంగా వినియోగ ప్రాంతాలకు చేరనిచో అభివృద్ధి కుంటు పడుతుంది. జన జీవనం అస్తవస్తం అవుతుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహోలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించ వచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం (%×జ జుఅస్త్రఅవ%) యొక్క కార్బొరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల



విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టియందు ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. తత్ఫలితంగా బెంగుళూరు పరిసర ప్రాంతాలతో ముందుగా ట్రాక్టర్లను బయో డీజిల్ తో నడపడం జరిగింది. యూరోపియన్ దేశాలలో ఉత్పత్తి అయిన డీజిల్ లో 2శాతం బయో డీజిల్ ను మిశ్రమిస్తున్నారు. గత భారత ప్రభుత్వం కూడా మొత్తం రవాణా ఇంధనాలుగా జీవ ఇంధనాలను 20శాతానికి పెంచాలనే లక్ష్య నిర్దేశం చేసింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. ఈ క్రమంలోనే 2006- 08 మధ్య కాలంలో రాష్ట్రంలో జీల ఇంధన మొక్కల పెంపకాన్ని చేపట్టారు. లక్ష ఎకరాలలో జీవ ఇంధన మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి మండలానికి ప్లాంటేషన్ మేనేజర్, బయోడీజిల్ కొరకు 4వేల రూపాయలు కేటాయించారు. ప్రభుత్వ భూములలో కానుగ మొక్కలను పెంచడం ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ సంఘాలకు, పంచాయితీ లకు, అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీలకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బ్లాక్ అండ్ అవెన్యూ ప్లాంటేషన్ పై రాష్ట్రంలో కోట్లు ఖర్చు చేశారు. 2007-08 లో కొనసాగించారు. ఇందిర ప్రభ అటకెక్కగా, సబ్సిడీలు మటు మాయమయ్యాయి. ప్రభుత్వం ప్రకటించినట్లు పంటకు మద్దతు ధర చెల్లించడం కానీ కొనుగోలు చేసిన దాఖలాలు లేనేలేవు. కోట్లాది రూపాయల అంచనాలతో ప్రణాళికా బద్ధంగా మొక్కల పెంపుదలకు కార్యాచరణ రూపొందించి అట్టహాసంగా పెంపకములను చేపట్టినా, అది ఆచరణ శూన్యమే అయింది. ప్రస్తుత పరిస్థితులలో బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది...

# నేటినుంచే తెలంగాణ అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)



ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి నేతలు ఆ ఎన్నికల్లో ఓడిపోగా, భట్టి విక్రమార్క, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు వంటి నేతలు కొంత ప్రయత్నించినా అధికార పార్టీని నిలదీసే పరిస్థితి ఏ మాత్రం రాలేదు. మరోవైపు రెండు పర్యాయాలు అసెంబ్లీలో ఎదుటివారిని మాట్లాడనిచ్చే అవకాశం ఇవ్వలేదు. అప్పటి పరిస్థితి ఇప్పుడు పూర్తిగా కనుమరుగయింది. వామపక్షాలదీ అదే పరిస్థితి. బీజేపీ ఒక్క సభ్యుడు మాత్రమే గెలిచినా, చివరకు వారి బలం ముగ్గురికి చేరుకుంది. కాని అధికార టీఆర్ఎస్ కు మాత్రం ఏ పార్టీ ఇబ్బంది పెట్టలేని పరిస్థితి ఉండేది. కాస్తో కూస్తో మిత్రపక్షంగా ఉన్న ఎం.ఐ.ఎం పార్టీనే ప్రజా సమస్యలపై, ఓల్డ్ సిటీ అభివృద్ధిపై కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితి ఉండేది. కాని ఈ దఫా 39 సభ్యులతో బీఆర్ఎస్ ప్రతిపక్షంగా ఉంది. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ను దూకుడుగా ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ దఫా అధికార పార్టీకి అసెంబ్లీలో కొంత ప్రతిఘటన పెద్ద ఎత్తున ఉండే అవకాశం ఉంది. అయితే బిఆర్ఎస్ అక్రమాలపై సిఎం రేవంత్ దులిపే అవకాశాలే మెండుగా ఉన్నాయి. బయట వారు చేస్తున్న విమర్శలపై గట్టిగానే సమాధానం ఇచ్చే అవకాశం ఉంది. అవినీతి, అక్రమాలు, కాళేశ్వరం వ్యవహారం, పబ్లిక్ సర్వీస్ కమిషన్, డబుల్ ఇళ్లు తదితర అం వాలపై ఏమాత్రం చాన్స్ తీసుకోకుండా దును మాడే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ప్రభు త్వాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ఎదుర్కోవడం అంత సులువేం కాదు. 39 మంది ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ గట్టి ప్రతిపక్ష పాత్ర పోషించే అవకాశం ఉన్నా అవినీతి అక్రమాల పాపాలు వెన్నాడుతుంటాయి. అయితే 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు, 7 ఎం.ఐ.ఎం ఎమ్మె ల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు సృష్టించే అవకాశాలు లేకపోలేదు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్ గా, మహబూబ్ నగర్, మెదక్, కరీంనగర్ స్థానాలకు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ఈ మారు కొత్త పాత్ర పోషించనున్నారు. తెలంగాణ శాసన సభలో ప్రతిపక్ష నేత హోదాతో కేసీఆర్ అసెంబ్లీలో అడుగుపెట్ట నున్నా..ఆస్పత్రికే పరిమితం కావడంతో అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే పరిస్థితి లేదు. తన ఫాం హౌస్ లో కేసీఆర్ జారి పడటం, తుంటి భాగం విరగడంతో ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ జరగడంతో దాదాపు మరో నెల రోజుల పాటు కేసీఆర్ బయటకు రావడం సాధ్యపడని పరిస్థితి నెలకొంది. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్న సభ ఎలా జరగనుందో అన్న ఆసక్తి అందరిలో నెలకొంది. ఈ సమావేశాల తొలిరోజే శాసన సభ స్పీకర్ ఎన్నిక జరగనుంది. ఇప్పటికే కాంగ్రెస్ నుండి గెలిచిన వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ స్పీకర్ గా నామినేషన్ వేశారు.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




'ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...

-ఎడిటర్

# బంగారు తల్లి



అర్పిత రోజూ లాగే స్కూలుకెళ్ళి తన స్నేహితురాలు కోసం ఎదురు చూసింది. మేడమ్ రావడంతో క్లాసు కూడా మొదలయింది కానీ తన ఫ్రెండు రూపసి మాత్రం రాలేదు నిన్న కూడా రానని చెప్పలేదు ఏమై ఉంటుంది అనుకుంది అర్పిత . ఇంటర్వెల్ లో మిగతా పిల్లలు చెప్పుకుంటూ ఉండటంతో విని హతాశురాలైంది . నిన్న సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వస్తూ దారిలో యాక్సిడియై రూపసి వాళ్ళ నాన్న చనిపోయారట. అందుకే ఈ రోజు స్కూలుకు రాలేదట. అయ్యో పాపం అనుకుంది అర్పిత. ఆరోజు స్కూల్లో చెప్పిన పాఠాలేవి మనసు పెట్టి వినలేకపోయింది అర్పిత.సాయంత్రం ఇంటికి వెళ్ళటానికి బస్సులో కూర్చుని ఉంది అర్పిత. వెనక సీట్లో వాళ్ళ మేడమ్ లు ఇద్దరు కూర్చుని రూపసి వాళ్ళ నాన్న యాక్సిడెంట్ గురించి మాట్లాడు కుంటున్నారు. బైకు డివైడర్ కు డీకొట్టి కింద పడిపోవడంతో తలకు దెబ్బతగిలిందట. వెంటనే హాస్పిటల్ కు తీసుకువెళ్ళినా బతక లేదట. హెల్మెట్ పెట్టుకొని ఉంటే బాగుండేది' అన్నారట డాక్టర్లు.అలా నెల రోజులు గడిచి పోయాయి - కానీ రూపసి మాత్రం స్కూలుకు రావటం లేదు. అర్పితకు ఏమీ తోచటం లేదు. ఆయమ్మ నడిగితే చెప్పింది . రూపసి ఇక స్కూలుకు రాదట. వాళ్ళ నాన్న చనిపోవ డంతో డబ్బుల్లేక స్కూలు మానిపించేశారట. వాళ్ళమ్ముకు ఉద్యోగం లేదు. రూపసికి తమ్ముడు కూడా ఉన్నాడు. వాళ్ళకు సొంతిల్లు కూడా లేదు. ఈ పిల్లలిద్దరినీ పెట్టుకొని ఆమె ఎలా సంసారం నెట్టుకోస్తుందో పాపం' అంటూ ఆయమ్మ దీర్ఘంగా నిట్టూర్చింది. స్నేహితురాలు రాకపోవటంతో దిగాలుగా ఇంటికి వెళ్ళింది అర్పిత. అప్పుడే అర్పిత వాళ్ళ నాన్న ఆఫీసు నుంచి ఇంటికొచ్చారు. వెంటనే అర్పిత ఏదో గుర్తుకొచ్చిన దానిలా "నాన్నా నాకు హెల్మెట్ ఉన్నదా అనడిగింది." ఉంది కానీ పెట్టుకెల్లట్లేదమ్మా! ఉక్కబోసినట్లుగా విసుగ్గా ఉంటుంది" అన్నాడు అర్పిత వాళ్ళ నాన్న.అర్పిత తన స్నేహితురాలి కథ చెప్పింది నాన్నకు నాన్న లేకపోతే కుటుంబం ఎన్ని కష్టాల పాలవుతుందో తను విన్న మాటలన్నీ చెప్పింది. పిల్లల జీవితం రోడ్డు పాలవుతుంది. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు వస్తాయి. స్కూల్లో ఆయమ్మ చెప్పిన విషయాలు, బస్సులో మేడమ్‌లు చెప్పుకున్న విషయాలు అన్నీ పూసగుచ్చినట్లుగా నాన్నకు వివరించింది."నాన్నా మీరు మాకు ఎప్పటికీ తోడుండాలి. అమ్మను సంతోషంగా ఉంచాలి. ఇవన్నీ జరగాలంటే మీరు ఎల్లవేళలా హెల్మెట్ ధరించాలి. అంటూ కన్నీళ్ళలో నాన్నను అర్థించింది. అర్పితను చూసి నాన్న కరిగిపోయాడు. "మంచిపనులు తెలిసినా ఏదో కొద్దిగా నిర్లక్ష్యం చేస్తుంటాము కానీ నీలా పిల్లలు అడిగితే ఏ తండ్రి హెల్మెట్ ధరించటం నిర్లక్ష్యం చేయడు. నువ్వునా బంగారు తల్లివి " అంటూ అర్పితను నాన్న ముద్దుపెట్టుకున్నాడు.

- డా.కందేపి రాణి ప్రసాద్

# పంథా మార్చిన బిజెపి

- వచ్చే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహం
- మూడు రాష్ట్రాల సిఎంల ఎంపికలో రాజకీయ చతురత

**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** ఎన్నికల సీజన్ ఇంకా ముగిసిపోలేదు. పార్లమెంట్ ఎన్నికలు ముందున్నాయి. ఈ క్రమంలో అనూహ్యంగా బిజెపి పెద్ద అడుగే వేసింది. మూడు రాష్ట్రాల్లో పాతకాపులను కాదని ముగ్గురు కొత్త సిఎంలను తెరపైకి తెచ్చింది. ఇది ఓ ర కంగా సాహసోపేతమైన నిర్ణయంగానే భావించాలి. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు అన్ని పార్టీలూ ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటు న్నాయి. మొన్నటి ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మొత్తం మూడు రాష్ట్రాలనూ తమ ఖాతాలో వేసుకుంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో భారీ మెజార్టీ సాధించింది. అంత కన్నా ముందు ముఖ్యమంత్రి ఎవరో ప్రకటించడం. ఎప్పుడూ ఈ విషయంలో ముందుగానే క్లారిటీగా ఉండే బీజేపీ ఈ సారి మాత్రం ఎందుకో కాస్త సమయం తీసుకుంది. ఫలితాలు విడుదలయ్యాక వారం రోజులకు గానీ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పేర్లను ప్రకటించలేదు. నిజానికి మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్థాన్‌లో వసుంధర రాజే ముఖ్యమంత్రి రేసులో ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో రమణ్ సింగ్‌కి పోటీలో ఉన్నారు. వీళ్ల ముగ్గురికే కచ్చితంగా మరోసారి అవకాశం వస్తుందని అంతా భావించారు. కానీ..అలా జరగలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన ఎన్నికలు కావడంతో ఆచితూచి అడుగులు వేయాలని నిర్ణయించు కుంది. దాదాపు వారం రోజుల పాటు మేధోమథనం చేసిన తరవాత మూడు రాష్ట్రాలకూ ముగ్గురు కొత్త వ్యక్తులకు సీఎం పదవిని కట్టబెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎంతో అనుభవం ఉన్న సీనియర్లను పక్కన పెట్టి బీజేపీ తీసుకున్న నిర్ణయంపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. రాజస్థాన్‌లో మొన్నటి వరకూ కాంగ్రెస్ అధికారంలో ఉంది. అశోక్ గహ్లోట్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. సంక్షేమ పథకాలు తమను కాపాడతాయని భావించినా అది పెద్దగా సాయపడలేదు. అంతర్గత విభేదాలతో పాటు మరి కొన్ని సమస్యలు ఓటర్లను బీజేపీ వైపు మళ్లేలా చేశాయి. ఇక్కడ మెజార్టీ సాధించింది కాషాయ పార్టీ. బీజేపీ అధికారంలోకి వస్తే కచ్చితంగా వసుంధర రాజేనే ముఖ్యమంత్రి అవుతారని అంతా అనుకున్నారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన భజన్ లాల్ శర్మని ముఖ్యమంత్రిని చేయడమే అందరికీ షాక్ కలిగించిన విషయం. భజన్ లాల్ శర్మ బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన వ్యక్తి. ఇక డిప్యూటీ సీఎంలుగా రాజ్‌పూత్, దళిత వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల్ని ఎంపిక చేసుకుంది. మొత్తంగా రాష్ట్రంలోని కీలకమైన మూడు వర్గాలకూ న్యాయం చేసింది. భజన్ లాల్ శర్మ ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితుడు. అంతే కాదు. బిజెపి భావజాలాన్ని బలంగా నమ్మే వ్యక్తి. ముందు నుంచి హైకమాండ్‌తో విధేయంగా ఉన్న వ్యక్తి కూడా. అలాంటి వ్యక్తికి పదవినిస్తే తమ విలువలను, పార్టీ సిద్ధాంతాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశముంటుందని బీజేపీ భావించింది. ఇక మధ్యప్రదేశ్ విషయానికొస్తే... శివరాజ్ సింగ్ చౌహాన్ లేని బీజేపీని అక్కడ ఊహించలేం. దాదాపు రెండు దశాబ్దాల పాటు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయనను కాదని మోహన్ యాదవ్ అనే కొత్త వ్యక్తికి సీఎం కుర్చీని కట్టబెట్టింది. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మోహన్ యాదవ్..ఓ సారి మంత్రిగానూ పని చేశారు. అనుభవ పరంగా చూసుకుంటే శివరాజ్ సింగ్ చౌహాన్ కన్నా తక్కువే. బ్రాహ్మిణ్, ఎస్‌సీ వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులకు డిప్యూటీ సీఎం పదవులు కట్టబెట్టింది. ఇప్పుడు మోహన్ యాదవ్ హయాంలో రాష్ట్రం ఎలా ఉండనుందన్న ఆసక్తి నెలకొంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ గతంలో రమణ్ సింగ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆ నేతను కాదని విష్ణు దేవ్ సాయ్‌కిఅవకాశమిచ్చింది అధిష్ఠానం.

గతంలో ఆయన కేంద్ర మంత్రిగా పని చేశారు. ఛత్తీస్‌గఢ్ బీజేపీ ప్రెసిడెంట్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ అనుభవం ఒక్కటే చూడలేదు బీజేపీ. ఆయన వర్గాన్నీ లెక్కలోకి తీసుకుంది. ఆయన గిరిజన తెగకు చెందిన వ్యక్తి. ఛత్తీస్‌గఢ్‌లో ఎక్కువ జనాభా గిరిజనులదే. వాళ్ల ఓటు బ్యాంకుని కాపాడుకోవాలంటే ఆ వర్గానికే చెందిన వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలని వ్యూహాత్మకంగా ఆలోచించింది. అందుకే..ఆయనకే ఆ పదవి ఇచ్చింది.

ఇప్పటికే గిరిజన తెగకు చెందిన ద్రౌపది ముర్ముకి రాష్ట్రపతి పదవిని కట్టబెట్టింది. ఈ ముగ్గురు ముఖ్యమంత్రులు కూడా బీజేపీ ఐడియాలజీకి చాలా దగ్గరగా ఉండే వ్యక్తులే. అయోధ్య రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దుపై పెద్ద ఎత్తున ప్రచారం చేసిన వాళ్లే. ఇలాంటి వ్యక్తులకు తమ పార్టీలో కచ్చితంగా ప్రాధాన్యత ఉంటుందన్న సంకేతాలిస్తూ ఇలా నిర్ణయం తీసుకుంది హైకమాండ్.

ఇదంతా ప్రధాని మోదీ, అమిత్‌షా వ్యూహం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. లోక్‌సభ ఎన్నికల ముందు సరిగ్గా ఓటర్ల పల్స్ పట్టుకోవడంతో పాటు కుల సమీకరణలతో మిగతా పార్టీలకు సవాల్ విసిరింది.

# ఉత్తమ పలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా





భూపాలపల్లి డిసెంబర్ 13 (ప్రజామంటలు): పదవతరగతి పరీక్షలలో జిల్లాలో చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులు ఉత్తమ పలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన జిల్లా లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల, ప్రధానోపాధ్యాయులతో, విద్యాశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.... 2023-24 సంవత్సరంకు గాను జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాటశాలలో చదువుతున్న విద్యార్థులు మొత్తం 3528 మంది పదోతరగతి చదువుతున్నారని ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థులను తక్షణం గుర్తించి వారిని ఏ.బి.సి క్యాటగిరి గా విభజించి వారికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లక్ష్య,అభ్యాస దీపిక అనే ప్రత్యేక స్టడీ మెటీరియల్ ఇచ్చి వారిని చదివించాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులు ఏ సబ్జెక్ట్ లో వెనుక పడ్డారో కనుక్కొని రోజులో ఉదయం 1గంట సాయంత్రం 1 గంట అదనంగా క్లాసులు నిర్వహించాలని తెలిపారు. గతంలో మాదిరిగానే స్పెషల్ క్లాస్ లలో చదువుకునే విద్యార్థులకు స్నాక్స్ ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు. పాఠశాలకు వివిధ కారణాల తో గైర్హాజర్ అయ్యే విద్యార్థులను గుర్తించి అవసరం అయితే వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రతీ రోజు పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి అన్నారు. ఇప్పటికే అవసరమైన పాటశాల లలో విద్యా వాలంటీర్లను కూడా నియమించడం జరిగింది అన్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థుల తల్లిదండ్రులతో వారి పిల్లల చదువు గురించి చర్చించి ఇంటి వద్ద కూడా రాబోయే 3 నెలలు పూర్తి స్థాయిలో చదివించెందుకు కృషి చేయాలని అన్నారు. 2023-24 సంవత్సరానికి గాను జరగబోయే పదవతరగతి పరీక్షలలో మన జిల్లా ను మొదటి స్థానంలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని భావేష్ మిశ్రా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాం కుమార్, సెక్టరియల్ ఆఫీసర్, కిషన్ రావు, ఎం.ఈ.ఓ లు, హెచ్.ఎం. లు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో మ్యాజిక్ జీపు డ్రైవర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీవో కు వినతి పత్రం



మెట్ పల్లి డిసెంబర్ 13 (ప్రజామంటలు): మెట్ పల్లి లో నవయుగ తెలంగాణ డ్రైవర్ వెల్పర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కోరుట్ల నియోజకవర్గ ఆటో మ్యాజిక్ జీపు డ్రైవర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్పల్లి మినీ స్టేడియం నుండి ర్యాలీగా వెళ్లి పాత బస్టాండ్ వద్ద నిరసన తెలిపి ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డీవో కు వినతి పత్రం అందించారు. ఆర్టీసీలో మహాలక్ష్మి ఉచిత బస్సు సౌకర్యం పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆటోలకు మరియు టాటా మ్యాజిక్ వెహికల్స్ లకు ప్రయాణికులు ఎక్కడం లేదని అందరూ ఉచిత ప్రయాణం ద్వారా బస్సుల్లో ప్రయాణం చేస్తున్న ద్వారా మాకు కుటుంబాలు రోడ్డున పడుతాయని ప్రభుత్వం ద్వారా మమ్మల్ని ఆదుకోవాలని వినతి అందించారు. జిల్లా అధ్యక్షులు గుగులావత్ శివలాల్ మరియు నియోజకవర్గ అన్ని మండలాల డ్రైవర్స్ మాట్లాడుతూ.... ప్రతి ఒక్క డ్రైవర్ కు పింఛన్ అమలు చేయాలని ప్రతి వాహనంపై గ్రీన్ ట్రాక్స్ ఎత్తివేయాలని పరిమితి ఫిట్నెస్ అన్నీ ట్యాక్స్ చాలాన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుగులవత్ శివలాల్ నాయక్, సెక్రెటరీ రంగు సంపత్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ యమ గణేష్ గుడిసెల గంగాధర్, వెంకటరమణ, ఎండి హైమద్, కొడిశెర్ల శంకర, ఎం.డి నవాబ్, కుడుముల లక్ష్మణ్, కావటి గంగాధర్, గట్టయ్య, మామిడి గంగాధర్, మల్లేష్, ఎస్ నరసయ్య, వసీం, జావిద్, మొండిడ్ల మొగిలి, గొర్రె శ్రీను, పాషా తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## భీమేశ్వర ఆలయంలో అయ్యప్ప స్వాములకు ప్రతిరోజు భిక్ష

### నిత్య అన్నదానం అభినందనీయం

### బిజెపి జిల్లా కార్యదర్శి మాచర్ల కుమారస్వామి గౌడ్



భీమదేవరపల్లి డిసెంబర్ 13 (ప్రజామంటలు): మండల కేంద్రంలోని భీమేశ్వర ఆలయం లో గత సంవత్సర కాలంగా దాతల సహకారంతో మండల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిత్య అన్నదానం నిర్వహించడం అభినందనీయమని హనుమకొండ జిల్లా బిజెపి కార్యదర్శి లయన్. మాచర్ల కుమారస్వామి గౌడ్ అన్నారు. నిస్వార్థంగా ఆలయ సన్నిధిలో రోజుకు 100 నుండి 150 స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు ఈ సందర్భంగా సహకరిస్తున్న దాతలకు, సేవలందిస్తున్న అయ్యప్ప స్వాములకు, భక్తులకు అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలు ఉంటాయని ఆకాంక్షించారు. అన్నదానానికి విరాళాలు ఇచ్చేవారు స్వయంగా కానీ, సంబంధిత స్వాముల ద్వారా చేరాల తిరుపతి స్వామికి అందజేయగలరు.

## శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన శివ స్వాములు



రేగోడు డిసెంబర్ 13 (ప్రజామంటలు): మండల కేంద్రమైన రేగోడు లోని గోకర్ణేశ్వర ఆలయం వద్ద మండలం అర్థమండలం శివమాల వేసిన శివ స్వాములు మాల విరమణ కోసం బుధవారం శ్రీశైలానికి తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో భాగంగా శివాలయం వద్ద ఉదయం తెల్లవారుజామున అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేసి గురుసాములు, భక్తులు శ్రీశైలానికి వెళ్ళే శివ స్వాములను సాగనంపారు.

## మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి, హ్యాట్రిక్ కొట్టిన తలసాని గ్రీటింగ్స్ చెప్పిన బీఆర్ఎస్ నేతలు



సనత్ నగర్ డిసెంబర్ 13 (ప్రజామంటలు): సనత్ నగర్ నియోజకవర్గ బీ.ఆర్.ఎస్ ఎమ్మెల్యేగా మూడో సారి భారీ మెజార్టీతో గెలిచి, హ్యాట్రిక్ కొట్టిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ కు అభినందనల వెల్లువ కొనసాగుతూనే ఉంది. బన్సీలాల్ పేట డివిజన్ కు చెందిన బీ.ఆర్.ఎస్. నాయకులు నాగులపల్లి మల్లేశ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ ను కలసి శాలువా కప్పి, పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో బన్సీలాల్ పేట డివిజన్ నుంచి బీ.ఆర్.ఎస్ కు అధిక మెజార్టీ వచ్చిందని ఈసందర్భంగా నాగులపల్లి మల్లేశ్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ తో మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేయగా, ఎమ్మెల్యే తలసాని మల్లేశ్ ను అభినందించారు. ప్రజాభిమానంతో ఎమ్మెల్యే తలసాని భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జై తెలంగాణ.. జైజై శీనన్న.. అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీ.ఆర్.ఎస్ నాయకులు అంగముత్తు శ్రీనివాస్, ఎక్కాల శ్రీనివాస్, మిట్టపెల్లి శ్రీనివాస్, బస్తీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాక్సింగ్ డే టెస్ట్ లో ఫ్యాన్స్‌కు ఉచిత గుండె పరీక్షలు

షేన్ వార్న్ జ్ఞాపకార్థం పాకిస్థాన్, ఆస్ట్రేలియా మధ్య బాక్సింగ్ డే టెస్టు జరగనుంది. క్రికెట్ ఆస్ట్రేలియా , షేన్ వార్న్ లెగసీ కూడా లెజెండరీ స్పిన్నర్ జ్ఞాపకార్థం టెస్ట్ మ్యాచ్‌లో మొదటి 4 రోజులలో అభిమానుల కోసం ఉచిత గుండె పరీక్షలను నిర్వహించబోతున్నాయి. మంగళవారం, డిసెంబర్ 12న క్రికెట్ ఆస్ట్రేలియా తన వెబ్‌సైట్‌లో ఈ సమాచారాన్ని అందించింది. ఈ ఏడాది బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్ డిసెంబర్ 26 నుంచి 30 వరకు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనుంది. ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్ వార్న్ 2022 మార్చిలో గుండెపోటుతో మరణించాడు. అప్పటికి వార్న్ వయసు 52 ఏళ్లు మాత్రమే. ఉచిత గుండె పరీక్ష కోసం మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ , చుట్టుపక్కల 23 మెడికల్-గ్రేడ్ హెల్త్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు.

## నిరవధిక సమ్మెతో నిలిచిపోయిన తపాలా సేవలు



మెట్ పల్లి డిసెంబర్ 13 (ప్రజామంటలు): నిరవధిక సమ్మెతో నిలిచిపోయిన తపాలా సేవలు నిరవధిక సమ్మె చేయడం వల్ల 2 రోజులుగా తపాల సేవలు నిలిచిపోవడంతో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇందులో భాగంగా గ్రామీణ తపాలా ఉద్యోగులు వారికి సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, 8 గంటల పని మరియు పెన్షన్ కల్పించాలని, సీనియర్ కి 12, 24, 36 సర్వీసుకి అదనపు ఇంక్రిమెంట్స్ కల్పించాలని, కమలేష్ చంద్ర కమిటీ రూపొందించిన సిఫార్సులను అమలు చేయాలని, టార్గెట్ల రూపంలో వేధించకుండా ఐపిపిబి కి సంబంధించిన సేవలను వర్క్ లోడ్ లోకి తీసుకోవాలని, రిటైర్మెంట్ అయినా తపాలా ఉద్యోగికి 5 లక్షల గ్రాట్యూటీ ఇప్పించాలని ధర్నా చేశారు. వారి డిమాండ్ లు నెరవేరే వరకు సమ్మె విరమించేది లేదని యూనియన్ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి,ఇబ్రహీంపట్నం, ముత్యంపేట సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని తపాలా ఉద్యోగులు మీర్జా ఫారూఖ్ అలీ బైగ్, లక్ష్మణ్, అభి చరణ్, లక్ష్మా రెడ్డి, కిరణ్మయూరి, భూమేష్, శివలాల్, రమణ, రాం నారాయణ, కొండయ్య, రాజేశం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



జమ్మికుంట, డిసెంబర్ 13 (ప్రజామంటలు): హైదరాబాద్ లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ను హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బుధవారం పరామర్శించి, మాట్లాడారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి కేటీఆర్, యశోద ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం కేసీఆర్ వేగంగా కోలుకుంటున్నారని తెలిపారు. ఆయన త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలో అడుగు పెడతారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. కేసీఆర్ గాయపడటం బాధాకరం అని ఆయన త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు.

# గర్భిణీ స్త్రీలు జాగ్రత్తలు తీసుకోవాలి

### టిబి సూపర్ వైజర్ జయప్రకాష్



గద్వాల డిసెంబర్ 13 (ప్రజామంటలు): గర్భిణీ స్త్రీలు, శిశువులు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి అని రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టిబి సూపర్ వైజర్ జయప్రకాష్ చెప్పారు. రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు సారథ్యం లో పెద్ద దన్వాడ, మాన్ దొడ్డి, పెద్ద తాండ్ర పాడ్, రాజోలి ఏ, బి, సి ఆరు ఉపకెంద్రము సబ్ సెంటర్ లలో ఏ ఎన్ ఎమ్ లు గర్భిణీ స్త్రీలకు శిశువులకు వ్యాధినిరోధక టీకాలు వేశారని ఆయన అన్నారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని చెప్పారు. గర్భిణీ స్త్రీలు ఏ ఎన్ ఎమ్ చేత పరీక్షలు చేయించుకోవాలని, గర్భ ధారణ నిర్ధారణ అయిన వెంటనే రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ను సంప్రదించాలి పరీక్షలు చేయించుకోవాలి అని చెప్పారు. అలాగే గర్భిణీ స్త్రీలు సాధారణ పరీక్షలు హిమోగ్లోబిన్, మూత్ర%శీ%, బి పి పరీక్షలు చేయించుకోవాలి అని ఆయన అన్నారు.సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న గర్భిణీ మహిళలు గర్భధారణ సమయంలో సగటున 12.5 కిలోల బరువు పెరుగుతారు అని చెప్పారు. గర్భిణీ స్త్రీలు తమ పేర్లు నమోదు చేయించుకొనిన వెంటనే టి డి ఇంజక్షన్ తీసుకోవాలని, టి డి ఇంజక్షన్ ద్వారా తల్లికి, బిడ్డకు దనుర్వాతం రాకుండా కాపాడుతుంది అని ఆయన అన్నారు. అలాగే గర్భ సమయంలో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు గర్భిణీ స్త్రీలు 12వారాలు నిండిన తరువాత ప్రతి రోజూ ఒకటి చొప్పున 6 నెలల వరకు 180 మాత్రలు వాడాలని ఆయన అన్నారు. గర్భిణీ స్త్రీలు 4 సార్లు రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నకు వచ్చి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు ను కలిసి చికిత్స తీసుకోవాలని రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టిబి సూపర్ వైజర్ జయప్రకాష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ హెలెన్, హెల్త్ అసిస్టెంట్ రంజిత్ కుమార్, ఏ ఎన్ ఎమ్ లు ఆశా వర్కర్లు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన ప్రేమ

### ప్రియుడు నిరాకరించడంతో యువతి ఉరి వేసుకుని మృతి

### ధర్మారం గ్రామంలో విషాదం



భీమదేవరపల్లి డిసెంబర్ 13 (ప్రజామంటలు): మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన చెప్యాల ఆనందం చిన్న కూతురు హరిప్రియ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని చనిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హరిప్రియ హైదరాబాద్ లో 2 సం.లు ప్రీమియర్ హాస్పిటల్ నర్సింగ్ పూర్తి చేసి 6 నెలల క్రితం అనారోగ్య సమస్యలతో స్వగ్రామం ధర్మారం వచ్చి ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గుర్రం రాజేష్, హరిప్రియ 5 సం.ల నుండి ప్రేమించు కుంటున్నారని తెలిపారు. హరిప్రియ రెండు రోజుల క్రితం తనను పెళ్లి చేసుకోమని రాజేష్ ను అడిగితే తిట్టి, గొడవపడి పెళ్లి చేసుకోనని, నీవు ఎక్కడికైనా వెళ్లి చావు అని అనడంతో మనస్తాపం చెంది మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్ రూమ్ లో సీలింగ్ ఫ్యాన్ కు చున్నీతో ఉరివేసుకొని చనిపోయినట్లు తెలిపారు. హరిప్రియ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.

## జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా కు తెలంగాణ గెజిటెడ్ అధికారుల శుభాకాంక్షలు



జగిత్యాల డిసెంబర్ 13 (ప్రజామంటలు): శాసనసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో దిగ్విజయంగా పూర్తి చేసిన నేపథ్యంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా కు తెలంగాణ గెజిటెడ్ అధికారులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఉద్యోగులందరి సమిష్టి కృషితో జరిగిన విజయమని అన్నారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికలను సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గంగుల సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడి రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, విజయేందర్, రిజ్వాన్, ప్రభు, కిరణ్, హనుమంతరావు, సంగీ రాజేశ్వరి, శైలజ రాణి తదితరులు పాల్గొన్నారు.

## బైకుపై నుండి పడి మహిళ మృతి



గొల్లపల్లి డిసెంబర్ 13 (ప్రజామంటలు): జూలపల్లి మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన చొప్పరి భూలక్ష్మి (భర్త: వెంకటి) 52 సంవత్సరాలు తన స్వగ్రామం నుంచి అల్లుడు తాళ్ల కృష్ణ కు నాటు వైద్యం కొరకు అల్లుడు కృష్ణ, ఆమె ఇద్దరు ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి వస్తుండగా మార్గమధ్యంలో చందోలి గ్రామ శివారులో రోడ్డుపై గుంతను తప్పించే ప్రయత్నంలో బైకు అదుపు తప్పి భూలక్ష్మి కి తలకు బలమైన రక్త స్రావము కావడంతో అక్కడికక్కడే మృతి చెందడంతో భర్త చొప్పరి వెంకట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

# నా ఈ విజయం, ప్రజా విజయం : ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### గజమాలతో ఘనస్వాగతం పలికిన కథలాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు

### పెగ్గేర్ల గ్రామంలో అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కథలాపూర్ డిసెంబర్ 13 (ప్రజామంటలు):** నా విజయం ప్రజా విజయం అని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు..వేములవాడ ఎమ్మెల్యే గా ఎన్నికై మొదటిసారి కథలపూర్ మండలనికి విచ్చేసిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కథలపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు..పెగ్గేర్ల గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప పడీ పూజలో పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నా విజయానికి అహర్నిశలు కృషి చేసిన వేములవాడ ప్రజానికి,కథలపూర్ ప్రజానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు..ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం మొదట గా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద పదిలక్షల వరకు అమలు చేస్తామని అన్నారు. అలాగే రానున్న రోజుల్లో మిగతా హామీలు అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.




# మంత్రి పొన్నం ప్రభాకర్ ను సన్మానించిన తుమ్మేటి సమ్మిరెడ్డి

**జమ్మికుంట డిసెంబర్ 13 (ప్రజామంటలు):** నూతనంగా మంత్రి పదవి బాధ్యతలు చేపట్టి బుధవారం కరీంనగర్ కు విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ని కలిసి శాలువా తో సన్మానం చేసిన జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి. ఈ సందర్బంగా జిల్లా డీసీసీ అధ్యక్షులు మానకొండూర్ ఎంఎల్ఏ కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లను సన్మానించారు.



# గాంధీ మెట్రో ఫిల్లర్ వద్ద గుర్తు తెలియని డెడ్ బాడీ

**సికింద్రాబాద్ డిసెంబర్ 13 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రి ఎదురుగా మెట్రో ఫిల్లర్ వద్ద పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి డెడ్ బాడీని పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు గుర్తించారు. చిలకలగూడ సబ్ ఇన్ స్పెక్టర్ వి. జ్ఞానేశ్వర్ కథనం ప్రకారం....గాంధీ మెట్రో ఫిల్లర్ 1028 వద్ద పడి ఉన్న దాదాపు 40-45 ఏండ్ల వయస్సు కలిగిన వ్యక్తి డెడ్ బాడీని గుర్తించారు. అయితే డెడ్ బాడీ వద్ద ఎలాంటి వివరాలు లభించక పోవడంతో బాడీని గాంధీ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేశారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తుపట్టిన వారు తమను 8712661252 లో సంప్రదించాలని ఎస్.ఐ. జ్ఞానేశ్వర్ విజ్ఞప్తి చేశారు.



# రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ సమావేశం



**జగిత్యాల డిసెంబర్ 13 (ప్రజామంటలు):** అదనపు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సమీకృత కార్యాలయము నందు వానాకాలము 2022-23 కి సంబందించిన సి ఎం అర్ చెల్లింపులపై రా మరియు బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశము నిర్వహించారు. అదనపు కలెక్టర్ సమావేశములో మాట్లాడుతూ వానాకాలం 2022-23 సి ఎం అర్ చెల్లించుటకు ప్రభుత్వం 31వ తేదీ గడుపు నిర్దేశించినందున 60% కన్న తక్కువ సిఎంఆర్ చెల్లించిన రా మరియు బాయిల్డ్ రైస్ మిల్లర్లు త్వరితగతిన సిఎంఆర్ చెల్లింపులు పూర్తి చెయ్యాలని ప్రభుత్వం నిర్దేశించిన గడువు తేదిలోగా బకాయిలు త్వరితగతిన చెల్లించాలని ఆదేశించారు. తదుపరి దీనికి సంబంధించి పౌరసరఫరాల క్షేత్రస్థాయి సిబ్బందికి రోజువారీ లక్ష్యం ప్రకారము వారి పరిధిలోని మిల్లుల నుండి సి ఎం అర్ డెలివరీలు చేయించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అలానే ఎఫ్ సి ఐ అధికారులు సిఎంఆర్ గోడౌన్ లలో అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చెయ్యాలని, వారు గోడౌన్ నకు వచ్చు స్టాక్స్ దిగుమతి చేసుకొనుటకు సరిపడు హమాలీలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. సమావేశములో జిల్లా పౌరసరఫరా అధికారి, జగిత్యాల గారు, జిల్లా మేనేజర్ పౌరసరఫరా సంస్థ, పౌరసరఫరా క్షేత్రస్థాయి సిబ్బంది మరియు రా బాయిల్డ్ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# మార్నింగ్ వాక్‌లో తనదైన ముద్రతో మంత్రి పొన్నం ప్రభాకర్

### ప్రజలు స్వేచ్ఛగా తమ సమస్యలను విన్నవించుకోవచ్చు



**సిద్దిపేట/హుస్నాబాద్ డిసెంబర్ 13 (ప్రజామంటలు):** గత ప్రభుత్వం ఆర్టీసీని గాలికి వదిలేసిందని, ఆర్టీసీని బలోపేతం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా కేంద్రంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ, ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్ స్టేషన్ లో మంత్రి పొన్నం పర్యటించారు. ప్రయాణికులతో ముచ్చరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహాలక్ష్మి పథకం అమలుపై మహిళలతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీని గాలికి వదిలేసిందని విమర్శించారు. ఆర్టీసీని బలోపేతం చేస్తామని, మరికొన్ని నూతన బస్సులను ప్రజల కోసం అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యల పట్ల స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వారం రోజులు కాకముందే ప్రతిపక్షాలైన బిఆర్ఎస్ బిజెపిలు చేస్తున్న వ్యాఖ్యల పట్ల సభ్య సమాజం అసహ్యించుకుంటుందని అన్నారు. ప్రతిపక్షాలు బాధ్యతగా వ్యవహరించాలని ప్రభుత్వంలోని లోటుపాట్లను చూపి, ప్రజాస్వామిక విలువలను కాపాడాలన్నారు. ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలను విరమించుకోకపోతే గట్టిగా జవాబు చెప్పాల్సి వస్తుందని మంత్రి పొన్నం అన్నారు. సంవత్సరంలోపు కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ... రాజాసింగ్ ఏమైనా జ్యోతిష్యం తెలుసా అని ప్రశ్నించారు. బిజెపి బీఆర్ఎస్లు వేరువేరు కాదని, వారి కుట్ర అందరికీ అర్థమైందని, కాంగ్రెస్లో గెలిచిన ఏ ఒక్క నాయకుడు పార్టీని వదిలి వెళ్ళడని మంత్రి పొన్నం అన్నారు. ప్రజా అభిప్రాయాల మేరకు, ప్రజల చేత ఎన్నుకోబడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు పూర్తి స్వేచ్ఛతో తమ సమస్యలను ప్రభుత్వానికి విన్నవించుకోవచ్చని తెలిపారు.

# నేషనల్ స్కూల్ గేమ్స్‌కి జ్యోతి హైస్కూల్ విద్యార్థిని 'సంజన' ఎంపిక




**జగిత్యాల డిసెంబర్ 13 (ప్రజామంటలు):** పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీ కి చెందిన 8 వ తరగతి విద్యార్థిని సంజన 8-12-2023 నుండి 10-12-2023 రోజులలో హైదరాబాద్ లోని సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్ లో నిర్వహించిన 67 వ ఎస్ జి ఎఫ్ స్టేట్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ లో కాంస్య పతకం సాధించి , తేది 08-01-2024 నుండి 13-01-2024 వరకు రాజస్థాన్ రాష్ట్రం లోని బర్మార్ లో నిర్వహించే 67 వ నేషనల్ స్కూల్ గేమ్స్ కి ఎంపిక కావడం జరిగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి జాతీయ స్థాయి కి ఎంపిక అయిన ఏకైక విద్యార్థిని 'సంజన' కావడం మన జగిత్యాల జిల్లాకే గర్వకారణం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియ్యల హరి చరణ్ రావు జాతీయ స్థాయి లో ఎంపిక అయిన విద్యార్థిని 'సంజన' ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లంచగొండి అధికారులకు యావజీవ కారాగార శిక్షలు వేయాలి

### కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ తరుపున పిటిషన్



**కథలాపూర్ డిసెంబర్ 13 (ప్రజామంటలు):** ఏస్సిబి, అంతర్జాతీయ అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా లంచగొండి అధికారులను ఉరి తీయాలి / యావజ్జివా కారాగార శిక్షవేయాలి. అలాగే ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఉద్యోగులకు విధించే శిక్షలు కఠినంగా ఉండాలని లంచగొండి అధికారులను తక్షణమే ఉద్యోగం నుండి తొలగిస్తూ వారికి రావలసిన పింఛన్ కూడా ఆపివేయాలని అలాగే ప్రతి గవర్నమెంట్ ఆఫీసుల్లో ఏసీబీ బోర్డులు ఏర్పాటు చేయాలని నిన్న ఉదయం కలెక్టర్ కి కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ తరుపున పిటిషన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల ఇంచార్జ్ తాలూకా మల్లేష్ మాట్లాడుతూ.... అవినీతి లంచగొండితనాలు చాప కింది నీరులా జరుగు తున్నాయని ఇది తక్షణమే అరికట్టాలని లంచం తీసుకోవడం చాలా నేరమని అలాగే లంచం ఇవ్వడం కూడా నేరమే అని ఆయన తెలిపారు. ఏ అధికారి అయిన లంచాలు అడిగితే భయపడకుండా ఏసీబీ వారిని సంప్రదించాలని అవినీతి అంతం సిసిఆర్ పంతం అని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా మల్లేష్, బలగం నిఖిల్, ఆవుల శోభన్ బాబు, అందే శివప్రసాద్, రంజిత్ సింగ్, శ్రీనివాస్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**జగిత్యాల డిసెంబర్ 13 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ భాగ్యరాజ్ ఫంక్షన్ హాల్ లో జగిత్యాల అర్బన్, రూరల్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, ముఖ్య నాయకులకు భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ములాసపు లక్ష్మి, రాజేంద్రప్రసాద్, జడ్పిటిసి మహేష్, మాజీ ఏఎంసి చైర్మెన్ దామోదర్ రావు, మాజీ జెడ్పీటీసీ ఎల్లా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, పిఏసిరఎస్ చైర్మన్ లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, రైతు బంధు సమితి మండల కన్వీనర్ లు నక్కల రవీందర్ రెడ్డి, జుంబర్తి శంకర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు చెరుకు జాన్, గంగాధర్, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు మహేష్, జిల్లా రైతు బంధు సమితి సభ్యులు కట్ట రాజేందర్, ఆత్మ చైర్మన్ రాజీ రెడ్డి, ఏఎంసి, పిఏసిథఎస్ వైస్ చైర్మన్‌లు ఆసిఫ్, సురేందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలి

### తెలంగాణ - రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, శేర్ నర్సారెడ్డి డిమాండ్



**హైదరాబాద్ డిసెంబర్ 13 (ప్రజామంటలు):** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి తక్షణమే కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, సకాలంలో హమాలీలు, గన్ని బ్యాగులతో పాటు లారీలను సకాలంలో సమకూర్చడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. తక్షణమే వరి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నివారించి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రబీ సీజన్ ప్రారంభమవుతున్న ప్రస్తుత తరుణంలో రైతులు పంట సాగు చేయడానికి విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకునేందుకు వాటిని కొనుగోలు చేయడానికి డబ్బులు అవసరం ఉన్నందున సకాలంలో వరి ధాన్యం కొనుగోలు డబ్బులను తక్షణమే రైతుల అకౌంట్లలో జమ చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు.

# జమ్మికుంట మండల సాంస్కృతిక నూతన సంఘం ఎన్నిక.

### మండల అధ్యక్షులు డాక్టర్ వేముల అశోక్



**జమ్మికుంట డిసెంబర్ 13 (ప్రజా మంటలు):** సమాజంలో కలలను ప్రోత్సహించి కళాకారులను సమాజానికి అందించడమే తమ లక్ష్యమని కరీంనగర్ జిల్లా సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు వైఎస్ శర్మ తెలిపారు.హుజురాబాద్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో జమ్మికుంట మండల సాంస్కృతిక కళాకారుల సమాఖ్య నూతన అధ్యక్ష,ఉపాధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ వేముల అశోక్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షుడిగా రంగు లింగయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న కళాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించి వారి ప్రతిభను బట్టి కలను చూపించే అవకాశం ఇస్తున్నామని దీన్ని మండల ప్రజలు ఉపయోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బోళ్ల కొమురెల్లి, డైరెక్టర్ నర్సింగోజు రవీంద్ర చారి, వీణవంక మండల గౌరవ అధ్యక్షుడు రామస్వామి, అధ్యక్షుడు గడ్డం నారాయణ, గోనెల సమ్మయ్య, దూలం సురేష్, శంకరపట్నం మండల అధ్యక్షుడు పడాల సత్తన్న, వల్భపూర్ గ్రామ గౌరవ అధ్యక్షుడు రాజమౌళి గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ కొమురయ్య, నాంపల్లి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



రాయికల్ మండలంలోని రామోజీపేట్ శివారు లోని ఫిల్టర్ బెడ్ పరిశీలించి, ఫిల్టర్ బెడ్ మరమ్మతులకు కావలిసిన నిధుల అంచనా రూపొందించాలి అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు. రామోజీపేట్ చెరువును పరిశీలించి అనంతరం రాయికల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

# ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



**భూపాలపల్లి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 13 (ప్రజామంటలు):** మహాదేవపూర్ మండల కేంద్రంలో పిఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆ సంస్థ చైర్మన్ చల్లా తిరుపతి పరిసిలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు ఉండకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గన్నికి కొరత రాకుండా చూడాలని, అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట సీఈఓ రాజబాబు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.



యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను బుధవారం పరామర్శించిన పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, డా. బోయినపల్లి మాధవి దంపతులు పరామర్శించారు. కేసిఆర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

prajamantalau daily pages (14-12)_times of varha main (13-2).qxd 12/14/2023 5:38 AM Page 6





జగిత్యాల ఎమ్మెల్యేగా రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల నియోజకవర్గం ఎంపిడిఓ లు, ఎంపిఓ లు.



అనారోగ్యం కారణంగా యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని పరామర్శించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి కోమటిరెడ్డి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్సీ కవిత ఆకాంక్షించారు.

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కలిసిన పిఆర్‌టియూటిఎస్ జగిత్యాల జిల్లా శాఖ



**జగిత్యాల డిసెంబర్ 13 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు జరిగిన సందర్భాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ని ఈ రోజు కలిసి పుష్పగుచ్చం అందించి, శుభాకాంక్షలు తెలిపి వివిధ విద్యారంగ సమస్యల గురించి చర్చించిన పిఆర్‌టి యూటిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు యాళ్ళ అమర్ నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు మండల, జిల్లా, రాష్ట్ర బాధ్యులు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థను పూర్తిగా విస్మరించడం జరిగింది అని తెలుపుతూ, రాబోయే కాలంలో విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చేపట్టే ఉన్నతి, తొలిమెట్టు లాంటి కార్యక్రమాలపై సమీక్ష చేసి విద్యావిధానంలో సమూల మార్పులు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ జరగడానికి ప్రభుత్వం వీలయినంత త్వరలో ఒక కమిటీ వేస్తుందన్నారు. 317 జిఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు తప్పకుండా న్యాయం జరిగే విధంగా, పాత 10 ఉమ్మడి జిల్లాలను 10 జోన్లుగా ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. అలాగే ఉద్యోగి స్థానికతకు తాము చదువుకున్న 1-7 తరగతులను ప్రామాణికంగా కాకుండా, 4-10 తరగతులను ప్రామాణికంగా తీసుకునే విధంగా ముఖ్యమంత్రి కి ప్రాతినిధ్యం చేస్తామన్నారు. ప్రతి పాఠశాలకు ఒక స్కావెంజర్ ను నియమిస్తామని, మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన వాగ్దానం మేరకు వేతనాలు పెంచుతామన్నారు. అలాగే మానిఫెస్టో లో పొందుపరిచిన అన్ని అంశాలను ఉద్యోగ ఉపాధ్యాయులకు తప్పకుండా అమలు చేస్తామన్నారు.

## కోరుట్ల ఎమ్మెల్యేకు నోట్ పుస్తకాలు, పెన్నుల బహుమానం



**కోరుట్ల డిసెంబర్ 13 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డులో బుధవారం రోజున జరిగిన కోరుట్ల నియోజకవర్గ స్థాయి విద్యా రంగ సమస్యలపై చర్చించిన సమావేశంలో మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్ నోట్ పుస్తకాలతో పాటు పెన్నులను కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల సంజయ్ కుమార్ కు బహుమతిగా అందజేశారు. కోరుట్ల ఎమ్మెల్యేగా పదవి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కోరుట్లకు మొదటిసారిగా వచ్చిన సందర్భంగా బుధవారం రోజున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కోరుట్ల నియోజకవర్గంలోని మెట్ పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాలకు చెందిన ప్రాథమిక విద్య, ఉన్నత విద్య, కళాశాల విద్య తదితర శాఖలకు చెందిన ప్రిన్సిపాల్ లు, ఆయా మండలాల విద్యా అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మోడల్ స్కూల్ లు, కే జీ బీ వీ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లతో పాటు ప్రధానోపాధ్యాయులతో ఆయా విద్యా సంస్థలలో నెలకొన్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. విద్యార్థుల సంఖ్య, ఖాళీల వివరాలు, బోధన సిబ్బంది ఖాళీలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ ను శాలువాతో సన్మానం చేయకుండా మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్ తో పాటు జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) ప్రోగ్రాం అధికారి, అర్థశాస్త్రం సహాయ ఆచార్యులు కే. వేంకయ్యలు వినూత్న పద్ధతిలో సన్మానం చేశారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు పెన్నులను మరియు సహజంగా తయారు చేసిన బొకేలను ఎమ్మెల్యే కల్వకంట్ల సంజయ్ కుమార్ కు అందజేసి, ప్రత్యేక ప్రశంసలను అందుకున్నారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు పెన్నులు బాగా ఉపయోగపడతాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, నోడల్ అధికారి నారాయణతో పాటు వివిధ విద్యా సంస్థల అధికారులు, ప్రిన్సిపాల్ లు తదితరులు పాల్గొన్నారు.

# సలార్, డంకీల మధ్య పోటీ








ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అతి పెద్ద వార్ కి మరో వారం రోజుల్లో తెర లేవనున్న విషయం తెల్సిందే. సలార్ డంకీ సినిమాలు క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబో తున్నాయి. ఈ రెండు సినిమాలు కూడా వెయ్యి కోట్ల వసూళ్లు సాధించగల సత్తా ఉన్న సినిమాలు అనడంలో సందేహం లేదు. కానీ పోటీ వల్ల కచ్చితంగా డ్యామేజీ తప్పదు అంటున్నారు. ప్రభాస్ హీరోగా కేజీఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ రూపొం దించిన సలార్ సినిమా ప్రీ రిలీజ్ బజ్ విషయంలో డంకీ పై పైచేయి సాధించినట్లుగా సోషల్ మీడియాలో చర్చ జరుగు తోంది. సినిమా ట్రైలర్ కి వచ్చిన రెస్పాన్స్ మరియు సినిమా అడ్వాన్స్ బుకింగ్ ఇలా అన్ని విషయాల్లో కూడా డంకీ పై సలార్ పై చేయి సాధించినట్లుగానే కనిపిస్తోంది. – హైదరాబాద్‌నే వైజాగ్ లా మార్చేస్తున్నారా ఇదే సమయంలో డంకీ సినిమా కి ఒక బ్యాడ్ సెంటిమెంట్ భయపెడుతోంది. గతంలో షారుఖ్ ఖాన్ హీరోగా నటించిన జీరో సినిమా కేజీఎఫ్ కి పోటీగా వచ్చిన విషయం తెల్సిందే. కేజీఎఫ్ ముందు జీరో సినిమా తేలిపోయింది. మరీ దారుణమైన ఫలితాన్ని షారుఖ్ జీరో సినిమా నమోదు చేసింది. అంతే కాకుండా ఆ సినిమా తో షారుఖ్ జీరో అయ్యాడంటూ చాలామంది కామెంట్స్ చేశారు. ఇప్పుడు కేజీఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ రూపొందించిన సలార్ సినిమాకి షారుఖ్ ఖాన్ డంకీ సినిమా పోటీ పడబోతుంది. జీరో సెంటిమెంట్ రిపీట్ అయ్యి డంకీ సినిమా ఫ్లాప్ అయ్యే పరిస్థితి ఉందంటూ కొందరు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో షారుఖ్ ఖాన్ ఫ్యాన్స్ కూడా ఒకింత ఆందోళనతో ఉన్నట్లుగా తెలుస్తోంది. సలార్ కి ఉన్న పాజిటివ్ బజ్ మరియు మాస్ లో ఉన్న క్రేజ్ నేపథ్యం లో కచ్చితంగా ఓపెనింగ్ కలెక్షన్స్ ఓ రేంజ్ లో ఉండే అవకాశం ఉంది. కనుక డంకీ సినిమా కి పాజిటివ్ టాక్ వచ్చినా కూడా ఓపెనింగ్ కలెక్షన్స్ తగ్గే అవకాశాలు ఉన్నాయి అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి సలార్ డంకీ సినిమాల మధ్య పోటీ రసవత్తరంగా సాగే అవకాశం కనిపిస్తోంది.

# జూనియర్‌తో నటించాలని ఉందన్న త్రిప్తి



గడిచిన రెండు వారాలుగా దేశాన్ని ఊపేస్తున్న చిత్రం యానిమల్. ఇప్పటికే రూ.800 కోట్ల కలెక్షన్ల మార్కు దాటి సంచలనాలు సృష్టిస్తున్న ఈ చిత్రం జెట్ స్పీడుగా రూ.వెయ్యి కొట్ల వైపు దూసుకెళుతున్నది. ఈ సినిమా ఎంత చర్చనీయాంశం అయిందో ఇందులో నటించిన వారికి అంతే పేరొచ్చింది. ముఖ్యంగా ఇందులో కథానాయికగా చేసిన రష్మిక కన్నా జోయా అనే చిన్న గెస్ట్ రోల్‌లో రణబీర్‌కపూర్ తో రోమాన్స్, ఇంటిమేట్ సీన్స్ చేసిన త్రిప్టి డిమ్రికి నేషనల్ వైడ్‌గా స్టార్ స్టేటస్ వచ్చేసింది. అంతేకాక ఐఎండీబీలో పాపులర్ నటి జాబితాలో ఫస్ట్ ప్లేస్ కొట్టేసింది.ఇదిలాఉండగా త్రిప్టి డిమ్రి ఆ చిత్రంలో నటిస్తుందని, ఈ చిత్రంలో నటిస్తుందంటూ అన్ని ఇండస్ట్రీలో సోషల్‌మీడియా రూమర్స్ వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో అమె ఇటీవల ఓ మీడియాతో మాట్లాడుతూ నాకు ఏ ఇండస్ట్రీ నుంచి అవకాశాలు రాలేదని, వాటి కోసం ఎదురు చూస్తున్నానని స్పష్టం చేసింది. నాకు సౌత్‌లో జూ.ఎన్టీఆర్ తో కలిసి నటించాలని ఉందని అందుకు ఛాన్స్ కోసం చూస్తున్నానని అ అవకాశాన్ని అసలు వదులుకోనని అన్నది. దీంతో పలువురు అభిమానులు ఎన్టీఆర్ అప్ కమింగ్ సినిమాలో అవకాశం ఇవ్వాలని నెట్టింట పోస్టులు పెడుతున్నారు. ఆమె మాట్లాడుతూ యానిమల్ సినిమా గురించి సినిమాలో నేను నటించిన సన్నివేశాలను చూసి నా తల్లిదండ్రులు షాక్ అయ్యారని వారికి ఇది జాబ్‌లో భాగంగా చేశానని చెప్పానని ఆయిన ఇంకా వారు షాక్‌లోనే ఉన్నారని తెలిపింది. నేను సినిమా కోసం చాలా కష్టపడ్డానని ఇప్పుడు నా పాత్ర సక్సెస్ అయి నేను ఊహించనంత పేరు తీసుకువచ్చిందని అన్నారు. ఇదిలాఉండగా ఈ సినిమా అనంతరం సోషల్ మీడియాలో అమ్మడి ఫాలోవర్స్ సంఖ్య 600కే నుంచి ఒక్కసారిగా 35 లక్షలకు చేరడం గమనార్హం.

## కీరవాణి, మురళీమోహన్ కుటుంబలా మధ్య పెళ్లిబంధం




సీనియర్ నటుడు మురళీ మోహన్- సంగీత దర్శకుడు కీరవాణి కుటుంబాల మధ్య పెళ్లి సంబంధం కుదురుతున్నట్లు కొంత కాలంగా ప్రచారం సాగుతోన్న సంగతి తెలిసిందే. కీరవాణి తనయుడు-మురళీ మోహన్ మనవరాలి మధ్య ప్రేమ వివాహం జరుగుతున్నట్లు నెట్టింట జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఇందులో నిజం ఎంతన్నది క్లారిటీ లోపించింది. ఆ రెండు కుటుంబాల నుంచి కూడా ఎలాంటి వివరణ లేకపోవడంతో ఇది రూమర్ అని అంతా భావిస్తున్నారు.తాజాగా వాటన్నింటిపై మురళీ మోహన్ క్లారిటీ ఇచ్చేసారు. అవును రెండు కుటుంబాలు వివాహ బంధంతో బంధుత్వం కలుపుకుంటున్నట్లు ప్రకటించారు. 'నాకు ఒక కుమార్తె..కుమారుడు గలరు. కుమార్తె పెళ్లి చేసుకుని విదేశాల్లో స్థిరపడింది. తనకి ఓ పాప. త్వరలో పెళ్లి జరగబోతుంది. ఫిబ్రవరి 14న హైదరాబాద్ లో వివాహం జరగనుంది. అలాగే నా కుమారుడుకి ఒక కుమార్తె. ఆమె పెళ్లి కూడా దాదాపు ఖాయమైంది. అందరూ ఊహించినట్లుగానే కీరవాణి ఇంట కోడలిగా వెళ్లనుంది. పెద్ద మనవరాలి పెళ్లి ఫిబ్రవరిలో అయితే..చిన్న మనవరాలి పెళ్లి వచ్చే ఏడాది జరగనుంది' అని తెలిపారు. దీంతో అన్నిరకాల ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడినట్లు అయింది. మురళీ మోహన్ కుమారుడు పేరు రామ్మోహన్. ఆయన కుమార్తె పేరు రాగ. బిజినెస్ లో మాస్టర్స్ పూర్తిచేసింది. ప్రస్తుతం సొంత వ్యాపారాలు చూసుకుంటున్నారు. ఆమెనే శ్రీసింహ వివాహమాడుతున్నట్లు తెలుస్తోంది. మీడియాలో ఇప్పటికే ఇది ప్రేమ వివాహంగా ప్రచారంలోకి వచ్చింది. శ్రీ సింహ టాలీవుడ్ లో హీరోగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. 'యమ దొంగ'తో చైల్డ్ ఆర్టిస్ట్ గా పరిచయమయ్యాడు. ఆ తర్వాత 'తెల్లవారితో గురువారం'..'దొంగలున్నారు జాగ్రత్త'.. 'ఉస్తాద్' సినిమాల్లో నటించాడు.

### ఆడపిల్లను కనాలని ఉన్నా..

# ఆయనతో కుదరదే!



అనసూయ భరద్వాజ్ పోస్ట్స్ సోషల్ మీడియాలో ఆసక్తి రేపుతుంటాయి. ఆమె చెప్పదల్చుకున్నది నిర్మొహమాటంగా చెప్పేస్తారు. బుల్లి తెరకు గుడ్ బై చెప్పి వెండితెరపై హంగామా చేస్తున్న ఈ అమ్మడు ప్రస్తుతం అల్లు అర్జున్ పుష్ప-2 లో నటిస్తుంది. తాజా ఇంటర్వ్యూలో అనుసూయ పలు విషయాలు పంచుకుంది. తన అత్తగారిది బీహార్ అని, అక్కడ సంప్రదాయలు కూడా ఎక్కువని పది మందిలో ఉన్నప్పుడు కొంగు కప్పుకుని ఉండాలని, తనకు పిల్లలంటే చాలా ఇష్టం అని అన్నారు. తనకు ఆడపిల్లలను కనాలని ఉందని అత్తగారికి సిగ్గు విడిచి చెప్పానన్నారు. తన మాట వినగానే తనపై అత్తగారు కోప్పడ్డారని తెలిపింది. నాకు అమ్మాయిని కనాలనీ ఉంది కానీ నా భర్త సహకరించడం లేదంటూ బోల్డ్ గా చెప్పింది. అనసూయ కామెంట్లు విన్న నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

# గిల్, జైస్వాల్ జోడీ చెత్త రికార్డు

భారత క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా పర్యటన సరిగ్గా ప్రారంభం కాలేదు. భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మంగళవారం కెబర్హాలో ఇరు జట్ల మధ్య జరిగిన రెండో టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆతిథ్య జట్టుకు అనుకూలంగా మారింది. డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా చేతిలో భారత జట్టు 5 వికెట్ల తేడాతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది.

తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 19.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఆపై ప్రోటీస్ జట్టు 15 ఓవర్లలో 152 పరుగుల విజయలక్ష్యాన్ని సవరించింది. దక్షిణాఫ్రికా 13.5 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య సిరీస్‌లో మూడో, చివరి మ్యాచ్ గురువారం జోహన్నెస్‌బర్గ్‌లో జరగనుంది. ఈ సమయంలో భారత జట్టు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌లు తమ పేరిట అవాంఛనీయ రికార్డులు సృష్టించారు. టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో గిల్-జైస్వాల్ జోడీ భారత ఓపెనర్ల అవాంఛనీయ ఫీట్‌ను పునరావృతం చేసింది. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ ఇద్దరూ ఖాతా తెరవకుండానే ఔటయ్యారు. జైస్వాల్‌ను మార్కో జాన్సెన్ అవుట్ చేయగా, లిజార్డ్ విలియమ్స్ బౌలింగ్‌లో గిల్ ఎల్‌బీడబ్ల్యూగా అవుటయ్యాడు. టీ20 అంతర్జాతీయ ఫార్మాట్‌లో భారత ఓపెనర్లిద్దరూ ఖాతా తెరవకుండానే ఔట్ కావడం ఇది రెండోసారి. అంతకుముందు 2016లో మిర్పూర్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ, అజింక్యా రహానే భారత్ తరపున ఇన్నింగ్స్ ప్రారంభించగా, ఇద్దరూ ఖాతా తెరవకుండానే ఔట్ అయ్యారు. జైస్వాల్-గిల్ జోడీ ఏడేళ్ల తర్వాత ఈ ఫీట్‌ను పునరావృతం చేసింది. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో జైస్వాల్-గిల్ జోడీ భారత్‌కు బలమైన ఆరంభాన్ని అందించడానికి ప్రయత్నిస్తోంది. మూడో మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌ను 1-1తో సమం చేయాలని భారత జట్టు భావిస్తోంది.




### రెండు జట్ల ప్లేయింగ్-11..

భారత్: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్, తిలక్ వర్మ, జితేష్ శర్మ (వికెట్ కీపర్), రింకూ సింగ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ముఖేష్ కుమార్, మహ్మద్ సిరాజ్.

దక్షిణాఫ్రికా: ఐడెన్ మార్క్రామ్ (కెప్టెన్), రీజా హెండ్రిక్స్, మాథ్యూ బ్రెట్జ్కీ, హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, మార్కో యాన్సన్, ఆండిల్ ఫెలుక్వాయ్, గెరాల్డ్ కోయెట్జీ, తబ్రైజ్ షమ్సీ, లిజాద్ విలియమ్స్.

## సీక్రెట్ ఏజెంట్‌గా కళ్యాణ్ రామ్




బింబిసార బ్లాక్ బస్టర్ విజయం అనంతరం ఆ స్థాయి విజయం కోసం ఎదురుచూస్తున్న కళ్యాణ్ రామ్ నుంచి వస్తున్న తాజా చిత్రం డెవిల్ – ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ పీరియాడిక్, స్పై థ్రిల్లర్ జానర్ లో వస్తున్న సినిమా ట్రైలర్ విడుదల చేయగా ఇందులో ఏదో సమ్‌థింగ్ ఉంది అనేలా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తూ నిర్మించిన ఈ చిత్రంలో విరూపాక్ష, సర్ వంటి వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న సంయుక్తా మీనన్ కథానాయికగా నటిస్తుండగా, మాళవికా నాయర్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 29న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో విడుదల చేయనున్నారు. ట్రైలర్ ప్రకారం బ్రిటీష్ పాలనలో ఓ నగరంలో జరిగే హత్యలు, ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఓ బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా నందమూరి కళ్యాణ్ రామ్ (ఐజ్జీ÷జాజీనిఖీజీప) ఎలా చేధించాడనే ఇతివృత్తంలో సినిమా ఆద్యంతం సస్పెన్స్‌తో, థ్రిల్లింగ్,యాక్షన్ సన్నివేశాలతో ఉండనున్నట్లు తెలుస్తోంది.

## తిలక్ వర్మకు అవకాశం ఇచ్చేందుకు అయ్యర్ ను పక్కన పెట్టారు



సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో భారత్ డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ వర్షంతో మ్యాచ్ నిలిచిపోయే సమయానికి 19.3 ఓవర్లలో 7 వికెట్లకు 180 పరుగులు చేసింది. రింకూ సింగ్, సూర్యకుమార్ యాదవ్ హాఫ్ సెంచరీ చేశాడు. డక్‌వర్త్ లూయిస్ విధానంలో సవరించిన లక్ష్యాన్ని (15 ఓవర్లలో 152) దక్షిణాఫ్రికా 13.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. హెండ్రిక్స్, మార్‌క్రమ్ ప్రొటీస్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌లో సెంచరీతో అలరించిన రుతురాజ్ గైక్వాడ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ రవి బిష్ణోయ్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో ఆడలేదు. దీంతో టీమిండియా మాజీ క్రికెటర్, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ట్విటర్ వేదికగా ప్రశ్నలు సంధించాడు. 'శ్రేయాస్ అయ్యర్, రవి బిష్ణోయ్ ఎందుకు ఆడటం లేదో ఎవరికైనా తెలుసా?. శ్రేయస్ అయ్యర్ ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌లో వైస్ కెప్టెన్. బిష్ణోయ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. నేను ఏదో మిస్ అయినట్లు అనిపించింది'అని ఆకాశ్ చోప్రా ట్వీట్ చేశాడు. ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆకాశ్ చోప్రా ట్వీట్ చూసిన నెటిజన్లు తమ తమ అభిప్రాయాలు తెలుపుతున్నారు. టీ20 ప్రపంచకప్ 2024 నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ అవకాశాలు ఇచ్చేందుకే మార్పులు చేయాల్సి వస్తుందని ఓ అభిమాని ట్వీట్ చేశాడు. సీనియర్ల రాకతో జూనియర్లకు చోటు దక్కడం లేదని ఇంకొకరు పేర్కొన్నారు. గిల్ రావడంతో రుతురాజ్, జడేజా రాకతో బిష్ణోయ్ బెంచ్‌కే పరిమితం అయ్యారు. తిలక్ వర్మకు అవకాశం ఇచ్చేందుకు అయ్యర్ ను పక్కన పెట్టారని ఫాన్స్ అంటున్నారు.

## స్టేడియం నిర్వాహకులకు క్షమాపణలు చెప్పాడు



యువ బ్యాటర్ రింకూ సింగ్ భారత్ తరఫున టీ20లలో అదరగొడుతున్నాడు. ప్రతి మ్యాచ్‌లో బౌండరీలు బాదుతూ పరుగుల వరద పారిస్తున్నాడు. ఆస్ట్రేలియాతో స్వదేశంలో టీ20 సిరీస్‌లో సత్తాచాటిన రింకూ.. తాజాగా దక్షిణాఫ్రికా గడ్డ మీద కూడా మెరుస్తున్నాడు. మంగళ వారం దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో రింకూ మెరుపు ఇనింగ్స్ ఆడాడు. 39 బంతుల్లోనే 68 పరుగులతో అజేయంగా నిలిచాడు. రింకూ ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. అయితే ఈ మ్యాచ్‌లో రింకూ సింగ్ బాదిన ఓ సిక్సర్ కారణంగా మీడియా గ్లాస్ బాక్స్ బద్దలైంది. ఇడెన్ మార్క్‌రమ్ వేసిన 19వ ఓవర్ చివరి బంతిని రింకూ స్ట్రైట్‌గా ఆడగా.. సైట్ స్క్రీన్‌పై ఉన్న మీడియా బాక్స్ గ్లాస్‌ను బలంగా తాకింది. దాంతో అది ముక్కలైంది. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. ఈ విషయం గురించి మ్యాచ్ అనంతరం స్పందించిన రింకూ.. స్టేడియం నిర్వాహకులకు క్షమాపణలు చెప్పాడు. బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో రింకూ మాట్లాడాడు. 'ఆ బంతిని సిక్సర్‌గా మలచాలని మాత్రమే భావించా. నా షాట్ కారణంగా మీడియా గ్లాస్ బాక్స్ పగిలిపోయిందని నాకు తెలియదు. ఆ విషయం గురించి నా సహచరులు చెప్పారు. గ్లాస్ బ్రేక్ చేసినందుకు స్టేడియం నిర్వాహకులకు క్షమాపణలు చెబుతున్నా' అని రింకూ సింగ్ పేర్కొన్నాడు. 'పవర్ ప్లేలో మూడు వికెట్లు కోల్పోయి జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చా. ఆ సమయంలో సూర్యకుమార్ యాదవ్ గైడ్ చేశాడు. వికెట్ల గురించి ఆలోచించకుండా.. నీ ఆట ఆడమని చెప్పాడు. క్రీజులో కుదురుకోవడానికి కొంత సమయం తీసుకున్నా. తర్వాత షాట్స్ ఆడాను' అని రింకూ చెప్పాడు.

## కోరుకున్నది దక్కకపోతే ఎవరైనా నిరాశ చెందుతారు



భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఎట్టకేలకు ప్రపంచకప్ 2023 ఫైనల్ ఓటమి గురించి స్పందించాడు. ఫైనల్ ఓటమిని తాను అస్సలు జీర్ణించుకోలేకపోయానని, ఓటమి బాధ నుంచి బయటపడటం తనకు చాలా కష్టంగా మారిందని రోహిత్ ఎమోషనల్ అయ్యాడు. తన కుటుంబం మరియు స్నేహితులు చుట్టూ ఉన్న విషయాలను తేలికగా చేశారని చెప్పాడు. ఓటమి బాధ నుంచి బయటపడటం కోసం సహకరించిన తన కుటుంబం మరియు అభిమానులకు రోహిత్ ధన్యవాదాలు తెలిపాడు. నవంబర్ 19న జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓడిపోయిన విషయం తెలిసిందే. అంతకుముందు వరుసగా పది విజయాలతో ఫైనల్ చేరిన భారత్.. ఫైనల్లో ఓడటంతో రోహిత్ సహా అందరూ కంటతడి పెట్టారు. ముంబై ఇండియన్స్ పోస్ట్ చేసిన వీడియోలో రోహిత్ శర్మ మాట్లాడుతూ%ొా% 'వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ ఓటమి నుంచి ఎలా బయటపడాలో నాకు తెలియలేదు. నేను అస్సలు జీర్ణించుకోలేకపోయా. నా ఫ్యామిలీ, ఫ్రెండ్స్ ఎంతో సపోర్ట్ చేశారు. నా చుట్టూ ఉన్న విషయాలను చాలా తేలికగా చేశారు. ఇది జీర్ణించుకోవడం సులభం కాదు కానీ.. జీవితం ముందుకు సాగుతుంటుంది. కాబట్టి మనం ముందుకు సాగాలి. నిజాయితీగా చెప్పాలంటే ముందుకు సాగడం అంత సులభం కాదు. ఎందుకంటే.. నేను ఎప్పుడూ వన్డే ప్రపంచకప్ చూస్తూ పెరిగాను. నాకు అదే గొప్ప బహుమతి. మేము ఇన్ని సంవత్సరాలు ప్రపంచకప్ కోసం కష్టపడ్డాం. చివరకు దాన్ని అందుకోలేకపోవడంతో నిరాశ చెందాం. కోరుకున్నది దక్కకపోతే ఎవరైనా నిరాశ చెందుతారు' అని అన్నాడు. 'మా వైపు (జట్టు) నుండి మేము చేయగలిగినదంతా చేసాము. మా వైపు నుండి ఏమి తప్పు జరిగిందని ఎవరైనా అడిగితే?.. మేము 10 గేమ్‌లు గెలిచాము. ఆ 10 గేమ్‌లలో మేము తప్పులు చేసాము. అయితే ఫర్ఫెక్ట్ గేమ్ అంటూ ఉండదు. ప్రతి గేమ్‌లో తప్పిదాలు జరుగుతాయి. జట్టు ప్రదర్శన పట్ల నేను గర్వపడుతున్నాను. మేము చాలా అద్భుతంగా ఆడాం. ప్రతి ప్రపంచకప్‌లో ఇలా ఆడలేరు. మేము ఎలా ఆడామని నాకు తెలుసు. మా ప్రదర్శన ప్రజలకు చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని రోహిత్ శర్మ వీడియోలో చెప్పాడు. 'ఫైనల్ తర్వాత నేను ముందుకు వెళ్లాలని అనుకున్నాను. అందుకే నేను ఎక్కడికైనా వెళ్లి నా మనస్సును కుదుటపరచాలనుకున్నా. నేను ఎక్కడ ఉన్నా.. అభిమానులు న వద్దకు వచ్చి ఎంతో బాగా ఆడారని అభినందించారు. వాళ్లను చూసి నాకు చాలా బాధగా అనిపించింది. మాతో పాటు ఫాన్స్ కూడా ప్రపంచకప్ గెలవాలని ఎన్నో కలలు కన్నారు. మాకు మద్దతుగా నిలిచారు. ప్రపంచకప్ సమయంలో మేము వెళ్లిన ప్రతి చోటా ఫ్యాన్స్ మాకు అండగా నిలిచారు. ఇందుకు వాళ్లను అభినందించాల్సిందే. కానీ ఫైనల్ గురించి ఆలోచించిన ప్రతిసారీ ఎంతో నిరాశ కలుగుతోంది' అని రోహిత్ చెప్పుకొచ్చాడు.

## 16 నుంచి హైదరాబాద్‌లో ఇండియన్ ప్రో బాక్సింగ్ లీగ్

భారతదేశంలో ప్రొఫెషనల్ బాక్సింగ్ క్రీడలో ఒక సంచలనాత్మకంగా నిలిచిన ఇండియన ప్రో బాక్సింగ్ లీగ్ డిసెంబర్ 16 నుంచి ప్రారంభంకానుంది. దేశంలోనే మొట్టమొదటి రాష్ట్ర ప్రో బాక్సింగ్ కౌన్సిల్, తెలంగాణ బాక్సింగ్ కౌన్సిల్ అధికారికంగా ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ లీగ్ ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ , నేషనల్ కమీషన్ ఫర్ ప్రొఫెషనల్ బాక్సింగ్ ఇన్ ఇండియా అధికారికంగా గుర్తించింది. ఈ మ్యాచ్‌లు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మరో మూడు రోజుల్లో మొదలుకానున్నాయి. " రోడ్ టు ది ఇండియన్ ప్రో బాక్సింగ్ లీగ్ " అనే గ్రాండ్ ప్రో బాక్సింగ్ ఫైట్ నైట్ ఈవెంట్‌ను ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ అసాధారణ ఈవెంట్ జిల్లా స్థాయి పోటీలు, మహిళల విభాగంలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జాతీయ టైటిల్ పోరుతో సహా పలు స్థాయిల పోటీల్లో అపూర్వమైన 10 ప్రో బౌట్‌లను ప్రదర్శిస్తుంది. అదనంగా, ఇది అగ్రశ్రేణి భారతీయ ప్రో బాక్సర్ శబరి జెతో అంతర్జాతీయ 10-రౌండ్ పోటీని కలిగి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలో క్రీడారంగంలో కొత్త శకానికి నాంది పలుకుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## డేవిడ్ వార్నర్ కు ప్లేయింగ్ ఎలెవన్ ఆస్ట్రేలియాలో ఆడే అవకాశం



పాకిస్థాన్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది. అక్కడ పాక్ జట్టు మూడు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ డిసెంబర్ 14 నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ కోసం ఆస్ట్రేలియా తన ప్లేయింగ్ ఎలెవన్‌ని ప్రకటించింది. మిచెల్ జాన్సన్ నుంచి గట్టిపోటీ ఉన్నా.. డేవిడ్ వార్నర్ ఈ ప్లేయింగ్ ఎలెవన్ ఆస్ట్రేలియాలో ఆడే అవకాశం పొందాడు. డేవిడ్ వార్నర్ కెరీర్‌లో ఇదే చివరి టెస్టు సిరీస్ అని తెలిసిందే. ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆర్డర్‌లో కెప్టెన్ పాట్ కమిన్స్‌తో పాటు డేవిడ్ వారెన్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లాబుస్‌చాగ్నే, స్టీవ్ స్మిత్ వంటి ఆటగాళ్లను ప్లేయింగ్ ఎలెవెన్‌లో చేర్చుకుంది. అదే సమయంలో పెర్త్ పిచ్‌పై జరిగే ఈ మ్యాచ్‌లో పాక్ బ్యాట్స్‌మెన్‌ను ఓడించగల పాట్ కమిన్స్‌కు బౌలింగ్‌లో మద్దతుగా మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ వంటి ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు.

### ఆస్ట్రేలియా అత్యుత్తమ ప్లేయింగ్-11..

డేవిడ్ వార్నర్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లాబుస్చాగ్నే, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, అలెక్స్ కారీ, మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, లేథన్ లియోన్, జోష్ హేజిల్‌వుడ్.

ఆస్ట్రేలియాకు చెందిన ఈ ప్లేయింగ్ ఎలెవన్ చూస్తుంటే.. పాకిస్థాన్ ను ఆస్ట్రేలియా ఏమాత్రం తేలికగా తీసుకోదలుచుకున్నట్లు కనిపిస్తోంది. పెర్త్‌లోని ఫాస్ట్, బౌన్సీ పిచ్‌పై కూడా ఆస్ట్రేలియా తన పూర్తి బలంతో కూడిన జట్టును ఉంచాలని నిర్ణయించుకోవడానికి ఇదే కారణం. అయితే, ఆస్ట్రేలియా జట్టులో చాలా మంది ప్రత్యేక ఆటగాళ్లు ఉన్నారు.

ఆస్ట్రేలియా జట్టు: డేవిడ్ వార్నర్, ట్రావిస్ హెడ్, స్టీవెన్ స్మిత్, మార్నస్ లాబుస్చాగ్నే, మిచెల్ మార్ష్, కామెరాన్ గ్రీన్, అలెక్స్ కారీ , పాట్ కమిన్స్ , మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, జోష్ హాజిల్‌వుడ్, ఉస్మాన్ ఖవాజా, స్కాట్ బోలాండ్, లాన్స్ మోరిస్.పాకిస్థాన్ తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఇంకా ప్రకటించలేదు. కానీ వారి సంభావ్య ప్లేయింగ్ ఎలెవెన్‌ను పరిశీలిద్దాం..

అబ్దుల్లా షఫీక్, ఇమామ్-ఉల్-హక్, షాన్ మసూద్ (కెప్టెన్), బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్ (కీపర్), సౌద్ షకీల్, ఫహీమ్ అష్రఫ్, షాహీన్ అఫ్రిది, హసన్ అలీ, మహ్మద్ వసీం జూనియర్, అబ్రార్ అహ్మద్.

పాకిస్థాన్ పూర్తి జట్టు: అబ్దుల్లా షఫీక్, ఇమామ్-ఉల్-హక్, షాన్ మసూద్ (కెప్టెన్), బాబర్ ఆజం, సౌద్ షకీల్, మహ్మద్ రిజ్వాన్ (వికెట్), అఘా సల్మాన్, ఫహీమ్ అష్రఫ్, హసన్ అలీ, మీర్ హమ్జా, షాహీన్ అఫ్రిది, మహ్మద్ వసీం జూనియర్. , ఖుర్రం షాజాద్, అమీర్ జమాల్, నోమన్ అలీ, సైమ్ అయ్యూబ్, అబ్రార్ అహ్మద్, సర్ఫరాజ్ అహ్మద్.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com